Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు


rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 114 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శనివారం, 8 - 11 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## వందేమాతర 150వ వార్షికోత్సవం.. ప్రత్యేక నాణెం, స్టాంపు విడుదల



**ఇంటర్నెట్ డెస్క్:** వందేమాతరం గేయం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక నాణెం, స్మారక తపాలాబిళ్లను విడుదల చేశారు. దీంతోపాటు జాతీయ గేయానికి సంబంధించి '150.ఇన్' అనే ఓ స్పెషల్ పోర్టల్‌నూ ఆయన ఆవిష్కరించారు. ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన వందేమాతరం సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్న మోదీ.. 'వందేమాతరం' అనే పదం మన వర్తమానంలో ఎంతో ఆత్మవిశ్వాసాన్ని రేకెత్తిస్తుందని, తద్వారా మనం సాధించలేని లక్ష్యమంటూ ఏదీ లేదనే ధైర్యాన్నిస్తుందని చెప్పారు. ఫలితంగా కోట్లాది మంది భారతీయుల్లో నూతన ఉత్తేజాన్ని కలిగిస్తుందని ఉద్ఘాటించారు. మోదీకి మద్దతుగా సమాజంలోని అన్ని వర్గాల పౌరులు బహిరంగ ప్రదేశాల్లో సామూహికంగా వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ వార్షికోత్సవాన్ని దేశవ్యాప్తంగా ఏడాది పొడవునా అనగా 2026 నవంబర్ 7 వరకూ నిర్వహించాలని మోదీ పిలుపునిచ్చారు. దీనికోసం ఈ ఏడాది అక్టోబర్ 1న కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందని ఆయన అన్నారు. దేశపౌరుల్లో ముఖ్యంగా యువతలో విప్లవాత్మక స్ఫూర్తిని రగిలించే ఈ గేయంను ఏడాది పాటు ఓ ప్రత్యేక కార్యక్రమంలా నిర్వహించడం వల్ల భావి తరాల హృదయాల్లో చిరకాలం నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ సక్సేనా, సీఎం రేఖా గుప్తా తదితరులు పాల్గొన్నారు. 1875 నవంబర్ 7వ తేదీన అక్షయ నవమి శుభ సందర్భంగా.. బంకిం చంద్ర ఛటర్జీ రచించిన 'ఆనంద్‌మఠ్' నవలలోని 'వందేమాతరం' గేయం తొలుత 'బంగదర్శన్' అనే సాహిత్య పత్రికలో ప్రచురిత మైంది. భారతదేశ స్వాతంత్ర్యోద్యమ సమయంలో ఈ గేయం ఎంతగానో స్ఫూర్తినిచ్చింది.

## అక్టోబర్‌లో శ్రీవారి హుండీ ఆదాయం ఎంతంటే..




**తిరుమల, (రాజధాని వార్తలు):** కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవారి దర్శనం కోసం భారీగా భక్తులు తరలి వస్తుంటారు. సెలవులు, వీకెండ్‌లలో అయితే ఆ సంఖ్య మరింత పెరుగుతుంది. గోవిందుడి దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉంటారు. గంటల పాటు నిరీక్షణ అనంతరం శ్రీనివాసుడిని కనులారా వీక్షించి భక్తులు పునీతులవుతారు. అలాగే స్వామికి వెండి, బంగారు, నగదు రూపాల్లో కానుకలు సమర్పిస్తుంటారు. తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. ఇదిలా ఉండగా.. అక్టోబర్ మాసంలో శ్రీవారిని ఎంత మంది భక్తులు దర్శించుకున్నారనే వివరాలను టీటీడీ ప్రకటించింది. అలాగే లడ్డూల విక్రయం, హుండీ ఆదాయం వివరాలను కూడా టీటీడీ ఈవో అనిల్ కుమార్ సంఘాల్ వెల్లడించారు. తిరుమల శ్రీవారిని అక్టోబర్ నెలలో 22.77 లక్షల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఈవో తెలిపారు. అలాగే శ్రీవారికి హుండీ ద్వారా రూ.119.35 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. అక్టోబర్ మాసంలో 1.23 కోట్ల లడ్డూల విక్రయం జరిగిందని.. 34.20 లక్షల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారని తెలిపారు. దాదాపు 8.31 లక్షల మంది భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నట్లు టీటీడీ ఈవో తెలిపారు. గత పాలక మండలిలో కొన్ని నిర్ణయాలు తీసుకున్నామని ఆయన అన్నారు. ఆళ్వార్ ట్యాంక్ నుంచి గోగర్భం వరకు టాయిలెట్లు ఇతర ఖర్చుల కోసం రూ.25 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. అమరావతిలో శ్రీవారి ఆలయం పనులు పునః ప్రారంభించినట్లు చెప్పారు. టీటీడీ పరిధిలో ఉన్న అన్ని ఆలయాల్లో అన్నప్రసాద వితరణ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. శ్రీవాణి ట్రస్ట్‌కు వచ్చే విరాళంలో ఆలయ నిర్మాణాల కోసం రూ.750 కోట్లు కేటాయించామని తెలిపారు. ఈనెల (నవంబర్) 17 నుంచి 25 వరకు తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అమ్మవారి బ్రహ్మోత్సవాలు సజావుగా సాగేలా అన్ని విధాల ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. శ్రీవారి భక్తులకు 10వ రోజున వైకుంఠ ద్వారా దర్శనం కల్పిస్తామని అన్నారు. టికెట్లు ఎలా ఇవ్వాలి అనే అంశం గురించి పరిశీలిస్తు న్నామన్నారు. వైకుంఠ ద్వారా దర్శనం టోకెన్లు ఎప్పుడు అందిస్తామనే విషయాన్ని మీడియా ద్వారా వెల్లడిస్తామని టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ పేర్కొన్నారు.

## వందేమాతర స్ఫూర్తి భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత నేటి తరంపై ఉంది

**- ఈస్ట్ కోస్ట్ రైల్వే కాన్స్ట్రక్షన్స్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అంకుష్ గుప్తా**



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** వందేమాతరం గేయం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నవంబర్ 7న ఉదయం 9:50 గంటలకు దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సందర్భంగా ఈస్ట్ కోస్ట్ రైల్వే కన్స్ట్రక్షన్స్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అంకుష్ గుప్త ఆధ్వర్యంలో విశాఖపట్నం కార్యాలయంలో వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిధి చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అంకుష్ గుప్త, చీఫ్ ఇంజినీర్-1 శ్రీనివాసరావు, చీఫ్ ఇంజినీర్-3 విష్ణుమూర్తితో పాటు ఇతర నిర్మాణ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వందేమాతర గీతాన్ని ఆలపించారు. అనంతరం సిఎఓ అంకుష్ గుప్తా మాట్లాడుతూ వందేమాతర గీతం నేడు 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఈ చారిత్రక సందర్భంలో దేశ వ్యాప్తంగా ఈ వేడుకలు నిర్వహించుకోవడం ప్రతీ భారతీయుడు గర్వం గా భావించాలన్నారు. ప్రతీ ఒక్కరూ ఆనాటి స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, ఐక్యత, దేశభక్తి స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

## మహిళా క్రికెటర్ శ్రీ చరణికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రోత్సాహకం

**- రూ.2.5 కోట్ల నగదు నజరానా - ఇంటి నిర్మాణం కోసం 1000 చ.గ. స్థలం - గ్రూప్ 1 ఉద్యోగం ఇవ్వాలని సీఎం నిర్ణయం - మర్యాదపూర్వకంగా క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిసిన శ్రీచరణి - మహిళా క్రికెటర్ కు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికిన మంత్రి నారా లోకేశ్**





**అమరావతి, (రాజధాని వార్తలు):** మహిళా క్రికెట్ వరల్డ్ కప్ విజేత, టీమిండియా సభ్యురాలైన తెలుగమ్మాయి శ్రీ చరణికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భారీ నజరానా ప్రకటించారు. శ్రీ చరణికి రూ.2.5 కోట్ల నగదు బహుమతి ఇవ్వాలని సీఎం నిర్ణయించారు. దీంతో పాటు ఇల్లు నిర్మించుకునేందుకు కడపలో 1000 చ.గ. స్థలం కేటాయిస్తున్నట్టు తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం లో గ్రూప్ 1 అధికారిగా ఉద్యోగం కూడా కల్పిస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. శుక్రవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును, మంత్రి నారా లోకేష్‌ను క్రికెటర్ శ్రీ చరణి మర్యాద పూర్వకంగా కలిశారు. ఉమెన్ వరల్డ్ కప్ గెలుచుకున్న ఆనందక్షణాలను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌తో శ్రీ చరణి పంచుకున్నారు. తనకు మద్దతుగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ శ్రీ చరణిని అభినందించారు. ఉమెన్ వరల్డ్ కప్ గెలుచుకోవడం ద్వారా భారత దేశ మహిళల సత్తా చాటారని, మహిళా క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచారని సీఎం అన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు భారత జట్టుకు అందించాలని అభిలషించారు. ఈ సందర్భంగా శ్రీ చరణి మహిళా క్రికెటర్లు సంతకాలు చేసిన టీ షర్ట్ ను ముఖ్యమంత్రికి అందించారు. దానిని ఆప్యాయంగా స్వీకరించిన ముఖ్యమంత్రి శ్రీచరణి బృందం భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. శ్రీ చరణితో పాటు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ కూడా ఉన్నారు.

అంతకుముందు గన్నవరం ఎయిర్ పోర్టులో శ్రీ చరణికి ఘన స్వాగతం పలికిన మంత్రులు అనిత, సవిత, సంధ్యారాణి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేశినేని చిన్ని, కార్యదర్శి సానా సతీష్, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు... ఆమెతో పాటు సీఎం క్యాంప్ కార్యాలయానికి వచ్చారు. క్యాంపు కార్యాల యంలో మంత్రి నారా లోకేష్ శ్రీ చరణికి స్వాగతం పలికారు.

## ప్రజల చేతిలో పల్లె రహదారుల సమాచారం

**- త్వరలో అందుబాటులోకి 'జియో రూరల్ రోడ్ మేనేజ్మెంట్ సిస్టం' - పైలెట్ ప్రాజెక్టుగా అడవి తల్లి బాటకు అనుసంధానం - సాస్కీ నిధులతో పల్లె పండగ 2.0 - క్షేత్ర స్థాయి పర్యటనలతో జల్ జీవన్ మిషన్, స్వమిత్వ పనుల పరిశీలన - స్వచ్ఛ జలం.. గుంతలు లేని రోడ్ల నిర్మాణానికి ప్రథమ ప్రాధాన్యం - పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి పారుదల శాఖల అధికారులతో సమీక్ష సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**



**మంగళగిరి, (రాజధాని వార్తలు):** పల్లె ప్రజలకు నాణ్యతతో కూడిన స్వచ్ఛమైన తాగునీటి సరఫరా, గుంతలు లేని రహదారులు అందుబాటులో ఉంచాలన్నదే తన ముందున్న ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ వెల్లడిం చారు. తన ప్రతి అడుగూ ఆ దిశగానే ఉంటాయని తెలిపారు. జల్ జీవన్ మిషన్, పల్లె పండగ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పక్కాగా పాటించాలని స్పష్టం చేశారు. పల్లె రోడ్ల సమాచారం ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో త్వరలో సరికొత్త సాంకేతికతను ఆవిష్కరించబోతున్నట్టు తెలిపారు. 'జియో రూరల్ రోడ్ మేనేజ్మెంట్ సిస్టం' ద్వారా గ్రామీణ రోడ్ల పూర్తి సమాచారాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకునే సాంకేతికతను అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు. సాస్కీ నిధుల సాయంతో పల్లె పండగ 2.0ని ప్రారంభించేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూత్రప్రాయంగా ఆమోదించారని, ఆర్థిక శాఖ నుంచి సమ్మతి రావాల్సి ఉందన్నారు. ఈ అంశంపై తక్షణం ఆర్థిక శాఖతో చర్చించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయి పర్యటనల్లో భాగంగా స్వమిత్వ పథకం కింద నిర్వహిస్తున్న సర్వేలో ప్రత్యక్షంగా పాల్గొని ప్రజల అభిప్రాయం సేకరిస్తాం. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీ సర్వే, గత ముఖ్యమంత్రి ఫోటోతో కూడిన పాసు పుస్తకాల కారణంగా ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. మన ప్రభుత్వంలో అలాంటి తప్పులకు తావుండదు. రీ సర్వే తర్వాత ఎవరి భూములు వారికి అప్పగిస్తూ ప్రాపర్టీ కార్డులు ఇస్తాం. రాజ ముద్రతో కూడిన కార్డులు అందిస్తాం. ఈ ప్రాపర్టీ కార్డులు వచ్చిన తర్వాత ఆయా స్థలాలు అమ్ముకునేందుకు, ఇతర ఆర్థిక ప్రయోజనాల కోసం వినియోగించుకునేందుకు అవకాశం లభిస్తుంద"న్నారు. ఈ సమీక్షా సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణ తేజ, సర్వే విభాగం కార్యదర్శి కూర్మనాథ్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన చీఫ్ ఇంజినీర్ బాలూ నాయక్, గాయత్రి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని, మంత్రి నారా లోకేష్‌ని కలిసిన ఉమెన్ క్రికెటర్ శ్రీచరణి, మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్.**



# అపురూప అద్వితీయం.. కార్తీక దీపోత్సవం










**నెల్లూరు, (రాజధాని వార్తలు):** శంఖనాదాలు, భక్తుల హర్షనాదాలతో ప్రతిధ్వనించిన వి ఆర్ సి మైదానం ఆకాశదీప ప్రజ్వలనలో వేలాదిగా పాల్గొన్న భక్త జనం. భక్తి ప్రవృత్తులతో మహిళల కార్తీక దీపారాధన. భక్తులను అలరించిన శంఖనాదం. శ్రీ రామానంద భారతి స్వాముల వారిచే లింగోద్భవం. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్న కార్తిక మాస లక్ష దీపోత్సవ కార్యక్రమంలో ఆకాశదీప ప్రజ్వలనతో తొలి ఘట్టం ప్రారంభమైంది. శంఖనాధాల మధ్య, భక్తుల హరిహర నామ స్మరణల మధ్య ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి దంపతులు, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుల సమక్షంలో శ్రీ రామానంద భారతి స్వాముల వారిచే లింగోద్భవం కార్యక్రమం కన్నులపండగగా సాగింది. వేలాదిగా తరలివచ్చిన భక్త జనం ఆకాశ దీపాన్ని ప్రత్యక్షంగా వీక్షించి తరించారు. శ్రీ పండరీనాథ స్వామివార్ల ఆలయాన్ని ప్రారంభించిన అనంతరం శ్రీ నాగేశ్వర జ్యోతిర్లింగానికి అభిషేకం చేశారు. అనంతరం భక్తులు వేలాదిగా ఏర్పాటు చేసిన కార్తీక దీపాలను వెలిగించి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, శ్రీశైలం ఆలయ పాలకమండలి ప్రత్యేక ఆహ్వానితులు వేమిరెడ్డి కోటారెడ్డి, రూరల్ ఎమ్మెల్యే సతీమణి కోటంరెడ్డి సుజా తమ్మ, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మణ్ నాయుడు పాల్గొన్నారు.

# 53వ డివిజన్ వెంకటేశ్వర పురం సెంటర్‌లో రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి అపూర్వ స్వాగతం పలికిన ప్రజలు






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని 53వ డివిజన్ వెంకటేశ్వర పురం సెంటర్‌లో డివిజన్ ఇన్‌చార్జ్, వెంగళరెడ్డి కోఆర్డినేటర్ పరంధామయ్య ఆధ్వర్యంలో రచ్చబండ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి హాజరై పార్టీ నేతలకు డివిజన్ స్థాయి కమిటీలపై అవగాహన కల్పించి కమిటీలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించి కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమాన్ని గురించి ప్రజలకు వివరించారు. ఆ ప్రాంతంలోని పలు దుకాణాలకు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి వైసిపి నేతలతో కలిసి వెళ్ళి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపునిచ్చిన కోటి సంతకాల సేకరణ ఉద్యమ కార్యచరణను ప్రజలకు వివరించి ప్రజల నుంచి సంతకాలు స్వీకరించారు. ఈ సందర్భంగా పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ 53 డివిజన్‌లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని వైసీపీ నేతలు ఉత్సాహంగా నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. మొదటి నుంచి నెల్లూరు నగర నియోజకవర్గంలో 53,54 డివిజన్లు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోట లాంటివన్నారు. మీ ఇంటి బిడ్డలాగా ప్రజలందరికీ సేవలు అందిస్తానని తెలిపారు. వైఎస్ఆర్ సీపీని బలోపేతం చేసి ఈ రాష్ట్రంలో మళ్లీ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవడమే లక్ష్యమన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో కష్టపడే ప్రతి నాయకుడు, కార్యకర్తకి, గౌరవం, విలువ దక్కేల జగన్ మోహన్ రెడ్డి భరోసా ఇస్తున్నారని అన్నారు. 53వ డివిజన్‌లో కమిట్మెంట్ ఉన్న నేత వెంగల్ రెడ్డిని వారికి సహకరిస్తూ డివిజన్లో ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు. ఈరోజు జగన్మోహన్ రెడ్డి తీసుకు వచ్చిన మెడికల్ కళాశాలలను చంద్రబాబు నాయుడు ప్రైవేటుపరం చేస్తూ అమ్మకుంటు సొమ్ము చేసుకుంటున్నాడని అన్నారు. పేదవారి కోసం తీసుకు వచ్చిన మెడికల్ కళాశాలను ప్రైవేటుపరం కాకూడదనే లక్ష్యంతోనే జగన్మోహన్ రెడ్డి కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి పిలుపునిచ్చారని తెలిపారు. ఇది అహంకారానికి పేదవాడి ఆత్మగౌరవానికి జరుగుతున్న యుద్ధమన్నారు. జగన్మోహన్ రెడ్డి పిలుపునిచ్చిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ఎక్కడ చూసినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. కోటి సంతకాల సేకరణకు ప్రజల నుంచి వస్తున్న విశేష స్పందన చూస్తుంటే మెడికల్ కళాశాలలు ప్రైవేట్ పరం చేసే నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం వెనక్కి తీసుకోక తప్పదన్నారు. నెల్లూరు నగర నియోజకవర్గంలో 60 వేల సంతకాలు టార్గెట్‌గా పెట్టుకుంటే ఈ రోజు లక్ష సంతకాలకు దాటే పరిస్థితి కనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి పెర్నాటి కోటేశ్వర రెడ్డి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు మజ్జిగ జయ కృష్ణారెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఊటుకూరు నాగార్జున, యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి చీదెళ్ల కిషన్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు ఆశ్రీత్ రెడ్డి, ఐటి విభాగం నగర అధ్యక్షులు ప్రసన్నకుమార్, అంగన్వాడి విభాగం అధ్యక్షురాలు రమీజా, నగర మున్సిపల్ విభాగం అధ్యక్షురాలు సూరి నాగేశ్వరి, నగర దివ్యాంగుల విభాగం అధ్యక్షులు షేక్ సుబహాన్, 53, 54 వైసీపీ నేతలు పాల్గొన్నారు.

# "జగనన్నకు శుభాకాంక్షలు తెలియజేసిన నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ"




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మాజీ ముఖ్యమంత్రివర్యులు మరియు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్ర 8 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రివర్యులు మరియు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించి జగన్మోహన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. మహానేత వై.యస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి, నివాళులర్పించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు. శాసనమండలి సభ్యులు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులతో పాటు పాల్గొన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు. జగన్మోహన్ రెడ్డి 8 సంవత్సరాల క్రితం చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్ర ఒక చారిత్రాత్మక ఘట్టం. ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో ప్రజల బాధలు తెలుసుకునేందుకు పాదయాత్రను ప్రారంభించిన వ్యక్తి మహానేత వై.యస్.రాజశేఖర్ రెడ్డి. వై.యస్.రాజశేఖర్ రెడ్డి ప్రారంభించిన పాదయాత్రకు జగన్మోహన్ రెడ్డి పవిత్రతను తీసుకొని వచ్చారు. చంద్రబాబు, లోకేష్‌లు ప్రజలకు మోసపూరిత హామీలిస్తూ, ప్రజలతో సంబంధం లేకుండా పాదయాత్రలు చేశారు. జగన్మోహన్ రెడ్డి ఏ కార్యక్రమం నిర్వహించినా, ప్రజలను దృష్టిలో ఉంచుకొని త్రికరణ శుద్ధితో నిర్వహిస్తారు. జగన్మోహన్ రెడ్డి ప్రజలతో మమేకమవుతూ, వారి సమస్యలు తెలుసుకుంటూ, వారికి భరోసాను కల్పిస్తూ పాదయాత్ర కొనసాగించారు. పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డిది. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారు. చంద్రబాబు ప్రజలకు అనేక రకాల హామీ ఇచ్చి మోసం చేశాడన్న భావన ప్రజల్లో ఉంది. జగన్మోహన్ రెడ్డి పర్యటనలో వస్తున్న జనాదరణను చూస్తుంటే, జగనన్న నాయకత్వాన్ని ప్రజలు తిరిగి కోరుకుంటున్నారని అర్థమవుతుంది. జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో 3648 కిలోమీటర్లు చేసిన ప్రజాసంకల్ప పాదయాత్రను గుర్తు చేసుకుంటూ, వేడుకలు నిర్వహించుకుంటున్నాం. జగన్మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర ఎనిమిది సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా, నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జగనన్నకు శుభాకాంక్షలు తెలియజేస్తుంది. భవిష్యత్తులో జగన్మోహన్ రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావాలని, రాష్ట్రం ప్రగతి పథంలో నడవాలని కోరుకుంటున్నాం. 2014 నుండి 2019 మధ్య కాలంలో తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రజలు పడుతున్న బాధలను తెలుసుకోవడానికి జగన్మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్ర ప్రారంభించారు. కోవిడ్ లాంటి పరిస్థితులను ఎదుర్కొన్నా, పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా అమలు చేశారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా అందించిన పరిపాలనలో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయి. చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు చిన్నాభిన్నం చేసింది. జగన్మోహన్ రెడ్డి కూటమి ప్రభుత్వంలో ప్రజలు పడుతున్న సమస్యలను తెలుసుకునేందుకు మరలా తిరిగి పాదయాత్ర ప్రారంభించనున్నారు. జగన్మోహన్ రెడ్డి రాష్ట్రానికి తిరిగి ముఖ్యమంత్రి అయితే, రాష్ట్రంలో కొత్త సువర్ణ యుగాన్ని ప్రజలు చూడబోతున్నారు.

# అయ్యప్ప స్వామి సేవా పీఠంలో సిరమ్మ




**భీమునిపట్నం, (రాజధాని వార్తలు):** లక్ష్మీపురం గ్రామంలోని శ్రీ అయ్యప్ప స్వామి సేవా పీఠంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమంలో నియోజకవర్గం వైకాపా ఇంచార్జి మజ్జి శ్రీనివాసరావు కుమార్తె మజ్జి సిరమ్మ పాల్గొని ప్రారంభించారు. అంతకు ముందు పీఠం నిర్వాహకులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సిరమ్మ అయ్యప్ప స్వామికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధ్యాత్మిక ఉట్టిపడేలా చక్కని వాతావరణం ఉందని కార్యక్రమాలు ఉన్నాయని బాగున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు ప్రశాంతి పట్నాయక్, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరి కిరణ్, స్థానిక ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు మరియు చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు పాల్గొన్నారు.

# జిల్లా అథ్లెటిక్స్ మీట్‌లో మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** క్రీడా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులందరూ విజేతలే అని రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ, సర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మాత్యులు కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బొండపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ బి 14 అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. ఈ పోటీలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడా పోటీల్లో ఓడిపోయిన వాళ్ళు ఉండరని, పోటీల్లో పాల్గొన్న అందరూ విజేతలే అని అన్నారు. గెలుపోటముల కన్నా పాల్గొనడమే ముఖ్యమన్నారు. అందువల్ల ఓటమికి ఏ ఒక్కరు నిరాశ చెందవద్దని అన్నారు. విద్యతో పాటు క్రీడలు కూడా విద్యార్థులకు ఎంతో అవసరం అన్నారు. క్రీడలు వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం మాణిక్యం నాయుడు, మాజీ జెడ్పిటిసి బండారు బాలాజీ, చిరంజీవి రాజు, బుచ్చిరాజు, ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వరరావు, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ గెద్ద గురునాయుడు, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వైభవంగా ప్రారంభమైన కార్తీక మాస లక్ష దీపోత్సవం

**- గణపతి పూజ, గోపూజతో ప్రారంభమైన లక్ష దీపోత్సవం - ప్రత్యేక ఆకర్షణగా శ్రీ పండరనాథ స్వామివార్ల ఆలయ నమూన, శ్రీ నాగేశ్వర జ్యోతిర్లింగం - వి ఆర్ సి ప్రాంగణంలో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఏర్పాట్లు - భక్తులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా అన్ని వసతుల కల్పన**






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే కార్తీక మాస లక్ష దీపోత్సవం వైభవంగా ప్రారంభమైంది. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో వి.పి.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని విఆర్‌సి మైదానంలో నిర్వహిస్తున్న కార్తీక మాస లక్ష దీపోత్సవ కార్యక్రమం గురువారం ఉదయం శివ నామస్మరణల మధ్య గణపతి పూజతో ప్రారంభించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై గణపతి పూజ నిర్వహించారు.

అనంతరం శ్రీ నాగేశ్వర జ్యోతిర్లింగం. శ్రీ పండరనాథ స్వామివార్ల ఆలయ నమూన ఆలయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష దీపోత్సవ కమిటి సభ్యులు మాట్లాడుతూ గత 9 ఏళ్లుగా కార్తీక మాస లక్ష దీపోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న భక్తులను ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నామన్నారు. భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేశామని వివరించారు. ఈ మూడు రోజులు దీపాలు వెలిగించి భగవంతుడి ఆశీర్వాదాలు పొందాలని ఆకాంక్షించారు. గురువారం సాయంత్రం బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు ప్రవచనం, ఆకాశ దీపం, లక్ష దీపోత్సవ కార్యక్రమం, మహా శివునికి విశేష భస్మాభిషేకం, విశేష హారతులు ఉంటాయని వివరించారు. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిల సహకారంతో వి.పి.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6, 7, 8 తేదీల్లో అత్యంత వైభవంగా కార్తీక మాస లక్ష దీపోత్సవంలో ప్రతి సంవత్సరం విష్ణువు, శివుడికి సంబంధించి ఒక్కొక్క ఆలయ నమూనాలను ఏర్పాటు చేస్తున్నామని, శ్రీ నాగేశ్వర జ్యోతిర్లింగం. శ్రీ పండరనాథ స్వామివార్ల ఆలయ నమూనాలతో పాటు భారీ శివాపర్వతుల విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్తీక మాసంలో వ్రతాలు, నోములతోపాటు దీపారాధనకు ఎంతో ప్రాధాన్యం ఉందని, ప్రజలందరికీ విష్ణువు, శివుడి ఆశీసులు అందాలన్న ఉద్దేశంతో ఈ లక్ష దీపోత్సవాన్ని ఇంత ఘనంగా చేపట్టామన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులతో కలిసి విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టామని, భక్తులకు నూనె, వత్తులు, సహా దీపాలు ఇక్కడే అందిస్తామని వివరించారు.

# పీఎంఎస్ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మాజీ సైనికులు, మాజీ కోస్ట్ గార్డ్ సిబ్బంది మరియు వారి వితంతువుల పిల్లలకు ఉన్నత వృత్తి విద్య కోసం ఆర్థిక సహాయం అందించే ప్రధానమంత్రి స్కాలర్‌షిప్ పథకంను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల సూచించారు. గురువారం జిల్లా సైనిక సంక్షేమ అధికారి జి.హరికృష్ణ ఆధ్వర్యంలో జిల్లా సైనిక్ బోర్డు సభ్యులు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా సైనిక్ బోర్డు చైర్మన్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉన్నత విద్య అభ్యసించే మాజీ సైనికుల పిల్లలకు ప్రధానమంత్రి స్కాలర్షిప్ పథకంలో భాగంగా బాలురకు నెలకు రూ. 2,500, బాలికలకు రూ.3,000 అందిస్తారన్నారు. ఇందులో నమోదు చేసుకునేందుకు వారికి అవగాహన కలిగించాలన్నారు. నవంబర్ 30 లోపు దరఖాస్తు చేసుకోవలసి ఉందన్నారు. అదేవిధంగా కేంద్రీయ సైనిక్ బోర్డు, రాష్ట్రీయ సైనిక్ బోర్డు ల ద్వారా అందించే సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఒక్క మాజీ సైనిక కుటుంబాలకు అందేవిధంగా చర్యలను తీసుకోవాలన్నారు. అలాగే జిల్లాలోని సీతారామపురానికి చెందిన జమ్మూ కాశ్మీర్‌లోని లైన్ అఫ్ కంట్రోల్‌లో మరణించిన మంద్ల ప్రసాద్‌కి సంబంధించిన ఎక్స్‌గ్రేషియా, వారి కుటుంబ సభ్యుల కారుణ్య నియామకం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను త్వరితగతిన అమలు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ను కలసిన వారిలో జిల్లా సైనిక్ బోర్డు సభ్యులు మాజీ వింగ్ కామాండర్ వల్లూరు శ్యాం ప్రసాద్, మాజీ హవాల్దార్ కారేటి కళాధర్, కార్యదర్శి మరియు జిల్లా సైనిక సంక్షేమ అధికారి హరికృష్ణ, మాజీ సైనిక అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ గద్దం రత్నయ్య, రమేష్ తదితరులు ఉన్నారు.

# మంత్రి లోకేష్‌తో కలిసి సుబ్బానాయుడు చిత్రపటానికి నివాళులర్పించిన వేమిరెడ్డి దంపతులు




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఏపీ ఆగ్రోస్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ ఛైర్మెన్ దివంగత మాలేపాటి సుబ్బానాయుడు కుటుంబ సభ్యులను ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. గురువారం దగదర్తికి చేరుకున్న ఆయనకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిలు స్వాగతం పలికారు. దివంగత మాలేపాటి సుబ్బానాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుబ్బానాయుడు సేవలను స్మరించుకుంటూ ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాలేపాటి కుటుంబంతో వారికున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, జిల్లా ఇన్చార్జి మంత్రి ఎన్ఎండి ఫరూఖ్, జిల్లా పార్టీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ లతో పాటు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు మరియు టిడిపి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్పర్సన్ ఝాన్సీ లక్ష్మీబాయి జన్మదిన వేడుకలు – పెద్ద ఎత్తున రక్తదాన శిబిరం







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్ పర్సన్ ఝాన్సీ లక్ష్మీబాయి జన్మదినాన్ని పురస్కరించుకుని నెల్లూరు ధనలక్ష్మీపురంలో మంగళవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పలమనాలజిస్ట్ డాక్టర్ పోకల రవి హాజరయ్యారు. శ్రీ చైతన్య సంస్థలు లక్షలాది మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకొని వివిధ వృత్తుల్లో స్థిరపడ్డారన్నారు. తాను కూడా శ్రీ చైతన్య సంస్థలో విద్యార్థిగా ప్రవేశించి నేడు సమాజంలో సమాజంలో గుర్తింపు కలిగిన డాక్టర్‌గా ఎదిగానన్నారు. ఈ సందర్భంగా సుమారు వంద మంది రక్తదానం చేశారు. అంతకుముందు చైర్‌పర్సన్ ఝాన్సీ లక్ష్మీబాయి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఆమె నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య ఏజీఎంలు నర్రా శ్రీకాంత్, వి కొండ రెడ్డి, కాలేజీ ఏజిఎం శ్రీరాములు, ఆర్ఐ వినయ్ కుమార్ పాల్గొన్నారు..

# వీఎస్‌యూలో “తెలుగు భాషా పరిరక్షణ, పరిశోధన, పరివ్యాప్తి” జాతీయ సదస్సు విజయవంతంగా ముగిసింది











**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (వీఎస్‌యూ) తెలుగు శాఖ, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన “తెలుగు భాషా పరిరక్షణ, పరిశోధన, పరివ్యాప్తి” జాతీయ సదస్సు గురువారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఘనంగా ముగిసింది. సదస్సు ముగింపు కార్యక్రమానికి ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాస రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ “తెలుగు భాష మన సంస్కృతికి, మనసుకు ప్రతిబింబం. భాష పరిరక్షణ అంటే కేవలం అక్షరాల పరిరక్షణ కాదుబీ ఆ భాషలోని ఆత్మను, భావాన్ని, సంస్కృతిని కాపాడటం కూడా మన బాధ్యత” అని తెలిపారు. ఆయన విద్యార్థులు, పరిశోధకులు భాషా అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాపన సందేశం అందించిన డాక్టర్ జి.వి. పూర్ణ చందు, కృష్ణా జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ “తెలుగు భాష విశాల సముద్రం వంటిది. దానిలోని విలువైన ముత్యాలను కనుగొని కొత్త తరాలకు అందించడం మనందరి బాధ్యత. భాష పరిశోధన అంటే పాత పాఠ్యాల సేకరణ మాత్రమే కాదు, వాటిని ఆధునిక సందర్భంలో పునర్మూల్యాంకనం చేయడమూ కావాలి” అని అన్నారు.

ఈ సందర్భంగా సదస్సులో దేశవ్యాప్తంగా ఉన్న పలు విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొని పత్రాలు సమర్పించారు. రెండు రోజుల పాటు కొనసాగిన ఈ సదస్సులో భాషా పరిణామం, సాహిత్య వైవిధ్యం, భాషా సాంకేతికత, ప్రజా సంస్కృతి, భాషా బోధనలో సవాళ్లు వంటి అంశాలపై చర్చలు జరిగాయి. ఈ సదస్సు కు సంచాలకులుగా ఆచార్య మాడభూషి సంపత్ కుమార్, తెలుగు విభాగాధిపతి డాక్టర్ మైల త్యాగరాజు, కన్వీనర్‌గా డాక్టర్ రాజారామ్, సదస్సు కో - కన్వీనర్ డాక్టర్ తెలిదేవులపల్లి విమల, డాక్టర్ వి. వెంకటేశ్వర్లు మరియు వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# దేదీప్యమానమైన విఆర్సి మైదానం

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** భక్తి ప్రపత్తుల మధ్య విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్తీక మాస లక్ష దీపోత్సవం సందర్భంగా నెల్లూరు నగరంలోని విఆర్సి మైదానం దేదీప్యమానంగా వెలుగొందుతోంది. విద్యుత్ కాంతుల మధ్య.. కార్తీక మాస వైభవం వెల్లివిరుస్తోంది. భారీగా తరలి వస్తున్న భక్తులు తమ సీట్లలో ఆసీనులై కార్తిక దీపాలు వెలిగించేందుకు సిద్ధమవుతున్నారు. దాంతో మైదానం అంతా భక్తి పరవశంతో మునిగి పోయింది.

# సంపాదకీయం

## నితీశ్‌ను కాదనలేని బీజేపీ

'బిహార్‌కి మజ్‌బూరి హై, నితీశ్‌కుమార్ జరూరి హై' (బిహార్ నిస్సహాయంగా ఉన్నది, నితీశ్‌కుమార్ నాయకత్వం అవసరం)... ఈ ఆకర్షణీయ నినాదాన్ని నేను మొట్టమొదట 2017లో భారతీయ జనతా పార్టీ కార్యాలయం వెలుపల విన్నాను. అనూహ్యంగా విన్న ఉద్ఘోష అది. లాలూప్రసాద్ యాదవ్‌తో ఉన్న రాజకీయ అనుబంధాన్ని తెగతెంపులు చేసుకుని నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీలో మళ్లీ చేరేందుకు నితీశ్ నిర్ణయించుకున్న సందర్భమది. బిహార్ ముఖ్యమంత్రిగా కొనసాగేందుకే నితీశ్ పార్టీ మారారని మరి చెప్పనవసరం లేదు. మోదీతో ఉన్న పాతస్నేహాన్ని మళ్లీ చిగురింపచేసుకునేందుకే ఆయన ఆ నిర్ణయం తీసుకోలేదు. రాజకీయ సౌలభ్యం కోసమే ఆయన మళ్లీ మోదీతో చేయి కలిపారు. ఇది జరిగి ఎనిమిది సంవత్సరాలు అవుతున్నప్పటికీ ఆ పరిస్థితిలో మార్పు ఏమీ లేదు. సరే బీజేపీకి నితీశ్‌బాబు పట్ల ప్రత్యేక ప్రేమ ఏమీ లేదు. 2013లో ప్రధానమంత్రి పదవికి అవసరమైన అర్హతలు నరేంద్ర మోదీకి లేనేలేవని తొట్టతొలుత నిరసన తెలిపిన నేత నితీశ్‌కుమార్. ఈ విషయాన్ని బీజేపీ మరచిపోయి ఉండదు. అయితే బిహార్‌లో ఎన్డీఏకు సమర్థంగా నేతృత్వం వహించగల నాయకుడు మరొకరు లేరన్న వాస్తవమూ బీజేపీకి బాగా తెలుసు. నితీశ్‌కు ప్రత్యామ్నాయంగా మరెవ్వరూ లేనందునే బీజేపీ ఆయనను ముఖ్యమంత్రిగా కొనసాగనిస్తోంది. వృద్ధాప్యం పైబడిన నేత నితీశ్. వయసు పొద్దు వాలిపోయిన వేళ ఆరోగ్యం సైతం ఆయనకు దూరంగా ఉంటోంది. ఇటువంటి పరిస్థితుల్లో మోదీయే సర్వం అయిన ఢిల్లీ దర్బార్‌కు విధేయుడుగా ఉండడమే మేలు అని నితీశ్ నిర్ణయించుకున్నారు. ఆ నిర్ణయంతో ఆయన నిశ్చింతగా ఉన్నారు. బిహార్ రాజకీయాలలో షేక్‌స్పియర్ విషాద నాటకం తరహాలో ఒక నాటకం సుదీర్ఘకాలంగా ప్రదర్శితమవుతోంది. మండల్ ఉద్యమంతో ఈ విషాద ప్రహసనం ప్రాంభమయింది. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికలు ఆ సుదీర్ఘ నాటకంలో చివరి అంకంగా చెప్పవచ్చు. మూడున్నర దశాబ్దాల క్రితం మండల్ ఉద్యమంతో ప్రభవించిన నాయకద్వయం లాలూ ప్రసాద్ యాదవ్, నితీశ్‌కుమార్. 'బ్రదర్స్ బిహారీ'గా సుప్రసిద్ధమయ్యారు. అయితే పరస్పరం పూర్తిగా భిన్నమైనవారు. తొలి జనప్రియ నాయకుడుగా అధికార అందలాలు ఎక్కిన లాలూప్రసాద్ యాదవ్ ఇప్పుడు శారీరకంగా బలహీనుడు. ఎన్నికల ప్రచారంలో పాల్గొనలేకపోతున్న అనారోగ్యగ్రస్తుడు. పార్టీ బాధ్యతలను పూర్తిగా కుమారుడు తేజస్వి యాదవ్‌కు అప్పగించారు. తేజస్వి నవతరం నాయకుడు. అయితే తండ్రిలో ఉన్న జన సమ్మోహన శక్తి ఈ యువనేతలో కానరాదు. 1970 దశకంలో జయప్రకాష్ నారాయణ్ నాయకత్వంలో జరిగిన విద్యార్థి యువజన ఉద్యమం నుంచి ప్రభవించిన నాగరీక నాయకుడు నితీశ్‌కుమార్. ఈయనా ఇప్పుడు వృద్ధాప్య సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్నారు. శరీరాని కంటే మానసిక సామర్థ్యాలను కుంగదీస్తున్న అనారోగ్యమది. బారతీయ జనతా పార్టీకి నరేంద్ర మోదీయే సర్వోన్నత నాయకుడు. మోదీ మాటే తుది మాట. అయితే సమస్త బిహార్ ప్రజలను సమరీతిలో ఆకట్టుకోగల సమర్థ నాయకత్వం బిహార్‌లో బీజేపీకి లేదు. భారత జాతీయ కాంగ్రెస్ శక్తియుక్తులను కాలం హరించివేసింది. ఇప్పుడు ఈ పార్టీ దాదాపు అచేతన స్థితిలో ఉన్నది. ఇక యువ నాయకుడు ప్రశాంత్ కిశోర్ బిహారీలను విశేషంగా ఆకట్టుకుంటున్నారు, సందేహం లేదు. అయితే కులమే నిర్ణయాత్మక అంశంగా ఉన్న బిహార్ రాజకీయాలలో ఈ యువనేత జయపతాక ఎగురవేయగలడా? సంప్రదాయ అధికార నిర్మాణాలు, సామాజిక నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఈ కొత్త నేత బిహార్ సమాజంలో మౌలిక మార్పులు తీసుకువస్తానని వాగ్దానం చేస్తున్నారు. బిహార్ ఓటర్లలో అత్యధికులు సైతం మౌలిక మార్పులు కోరుకుంటున్నారు. మరి ప్రశాంత్ కిశోర్ నాయకత్వంలోని జన్ సురాజ్ పార్టీకి వారు ఓటు వేస్తారా? ఇప్పుడు మళ్లీ నితీశ్‌కుమార్ విషయానికి వద్దాం. బిహార్ ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణ స్వీకారం చేయడంలో నితీశ్ రికార్డు సృష్టించారు. ఇప్పటికి మొత్తం తొమ్మిదిసార్లు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. రాజకీయ అథ్లెటిక్స్‌లో ఒలింపిక్ స్వర్ణపతకాన్ని అందుకోవడానికి ఆయన అందరికంటే బాగా ముందంజలో ఉన్నారు మరి. అనేక పరిమితులు ఉన్నప్పటికీ బిహార్‌కు ఆయన నాయకత్వం తప్పనిసరి అని పలువురు, ముఖ్యంగా బీజేపీ భావిస్తోంది. ఐదు సంవత్సరాల క్రితం కొత్త తరం బిహారీ రాజకీయ నాయకుడు చిరాగ్ పాశ్వాన్‌ను ప్రోత్సహించడం ద్వారా నితీశ్ స్థాయిని తగ్గించేందుకు బీజేపీ ప్రయత్నించింది నితీశ్ ప్రాధాన్యాన్ని తగ్గించడం ద్వారా జనతాదళ్ (యునైటెడ్) పార్టీ ఓటర్లను తనవైపు తిప్పుకోవాలన్నది బీజేపీ ఎత్తుగడ. ఈ వ్యూహం దాదాపుగా ఫలించింది. గత శాసనసభ ఎన్నికల్లో జనతాదళ్(యు) కేవలం 43 సీట్లు మాత్రమే కైవసం చేసుకోగా బీజేపీ 74 నియోజకవర్గాలలో జయపతాక నెగురవేసింది. బీజేపీ, జనతాదళ్(యు) మధ్య అధికార సమతౌల్యత జాతీయ రాజకీయ పక్షానికే అనుకూలంగా మారింది. అయినప్పటికీ నితీశ్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించేందుకు బీజేపీ సంకోచించింది. తమ సొంత అభ్యర్థిని ముఖ్యమంత్రిని చేసేందుకు సుముఖత చూపలేదు. నితీశ్‌కుమార్ అపరచాణక్యుడు. బీజేపీ ఎత్తుగడలను అర్థం చేసుకున్నారు. ఆ పార్టీతో పొత్తును కొనసాగించడం ప్రమాదకరమని భావించారు. మహారాష్ట్రలో శివసేనను నిలువునా చీల్చివేసిన రీతిలో బిహార్‌లో తన పార్టీని బీజేపీ చీల్చకుండా ఉంటుందా అని నితీశ్ ఆలోచించారు. సంభావ్య పర్యవసానాల గురించి భయపడ్డారు. 2022లో బీజేపీతో తెగతెంపులు చేసుకుని ప్రతిపక్ష కూటమి 'ఇండియా'లో చేరారు. అయితే జాతీయ స్థాయిలో అగ్రగామి నాయకుడుగా ఎదగాలన్న తన ఆకాంక్ష నెరవేరేందుకు ఇండియా కూటమి సహకరించదనే భావన ఆయన మనసును తొలిచి వేసింది.

## నూతనంగా వచ్చిన ఎంఆర్ఓ, ఎంపీడీవోలను కలిసిన జనసేన మండల కమిటీ





**భద్రాచలం, (రాజధాని వార్తలు):** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం ఎటపాక మండలం నకు కొత్తగా వచ్చిన ఎం ఆర్ ఓ శ్రీనివాస్ ఎంపీడీవో నాగమనీ లను కలిసిన ఎటపాక జనసేన మండల కమిటీ సభ్యులు శాలువ పుష్ప గుచ్ఛంతో సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఎటపాక మండల అధ్యక్షుడు మారాసు గంగాధర్ మాట్లాడుతూ వారితో మండలంలో ఉన్నటువంటి సమస్యల గురించి వివరించడం జరిగింది. సందర్భంగా వారు మాట్లాడుతూ మండలాల్లో ఉన్నటువంటి సమస్యలు మా దృష్టికి తీసుకురావాలనీ వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జనసేన పార్టీ యూత్ ప్రెసిడెంట్ కొమ్ము వెంకటేష్ ఉపాధ్యక్షులు మోల సతీష్ మందా సుబ్రహ్మణ్యం గోవింద్ వెంకట్ కార్యదర్శి రాపోలు కుమారస్వామి లు పాల్గొనడం జరిగింది.

## కోవూరు పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా యస్.పి. అజిత వేజెండ్ల





**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరు సర్కిల్ ఆఫీసు, పోలీసు స్టేషన్ చుట్టూ వున్న పరిసరాలను పరిశీలించి, పోలీస్ స్టేషన్ ఆవరణంలో మొక్కలను నాటి పచ్చదనం పెంచాలి. తదుపరి స్టేషన్ మ్యాప్, సిసి కెమెరాలను పరిశీలిస్తూ స్టేషన్ పరిధిలో ఉన్న పరిస్థితులు, నేర ప్రాంతాలపై ఆరా తీసిన యస్.పి. పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్‌లు, సస్పెక్ట్‌లు మరియు పాత నేరస్తులపై నిఘా పెంచాలి. క్రిమినల్ చర్యలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు. ప్రతి ఆదివారం వారికి తప్పక కౌన్సెలింగ్ ఇవ్వాలి. ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకుంటూ, ఓపికగా ఉండాలి. ఫిర్యాదుదారులు వచ్చిన వెంటనే పలకరించి, వారికి నీరు వంటి కనీస సౌకర్యాలు అందించి, వారి సమస్యను ఓపికగా విని, ధైర్యం నింపి, భరోసా కల్పించాలి. ఫిర్యాదుదారులను మన కుటుంబంలో ఒక సభ్యులుగా భావించి, అక్కున చేర్చుకోవాలి. అంకిత భావంతో పని చేయాలని సూచన. శాంతిభద్రతల పరిరక్షణ, మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన.. ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశాలు. విజబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ వ్యవస్థను ముమ్మరం చేయాలి. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశాలు. హైవేపై ప్రమాదాలను తగ్గించాలి. సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలి. పోలీస్ స్టేషన్ సిబ్బంది యొక్క యోగ క్షేమాలు అడిగి, ఏమైనా సమస్యలు ఉన్నాయా? వారి యొక్క గ్రీవెన్స్‌ను అడిగి, వెంటనే పరిష్కరించేలా ఆదేశాలు.

## వైఎస్ఆర్సిపి నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన భీమిలి సమన్వయకర్త



**భీమిలి, (రాజధాని వార్తలు):** భీమిలి నియోజకవర్గం, ఆనందపురంలో భీమిలి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన,వైఎస్ఆర్సీపీ జిల్లా పార్టీ అధ్యక్షులు,భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను)తన కుమార్తె సిరి సహస్ర(సిరీమ్మ) మరియు అల్లుడు ప్రదీప్ బాబు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి చిన్న శ్రీను మాట్లాడుతూ నియోజకవర్గం నాయకులకు, కార్యకర్తలకు నేను ఎంతో రుణపడి ఉంటాను అని 2024 ఎన్నికలు అయిన నాటినుండి మీరంతా ఎన్నో కష్టాలను, నష్టాలను అనుభవించి కూడా మీరందరూ ఇక్కడ జరిగే పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేస్తూ నాకు ఎంతో సహకరిస్తున్నారని మన పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి నాకు ఒకటే మాట చెప్పారు అని విజయనగరం జిల్లాలో పార్టీ అధ్యక్షుడిగా నీ బాధ్యతలు నెరవేర్చుకుంటూ, మరొకవైపున నువ్వు భీమిలి నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా గెలిచి రావాలని నాకు ఈ భీమిలి నియోజకవర్గం ఇన్చార్జి బాధ్యతలను అప్పగించడం జరిగింది అని అన్నారు. ఆయన ఆదేశాల మేరకు ప్రతి కార్యకర్తకు, ప్రతి నాయకుడికి నేను భరోసా ఇస్తున్నాను, మీ గౌరవం పెంచే విధంగానే నేను పని చేస్తాను అని ఎల్లవేళలా మీకు అండగా ఉంటానని పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పిటిసిలు, వార్డు అధ్యక్షులు, వార్డు కార్పొరేటర్లు, ఎంపీటీసీలు సర్పంచులు, మహిళా ప్రజాప్రతినిధులు, ఇతర ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## కొండరెడ్ల గిరిజనుల సంక్షేమ అధికారిగా భూక్య గన్య నియామకం

**భద్రాచలం, (రాజధాని వార్తలు):** భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలోని కొండరెడ్ల విభాగంలో కొండరెడ్ల అధికారిగా (పి వి టి జి) భూక్య గన్య నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన ములకలపల్లి మండలం తాసిల్దారుగా పని చేస్తున్న ఆయనను భద్రాచలం ఐటిడిఏ కార్యాలయంలో కొండరెడ్ల విభాగం ఖాళీగా ఉన్న పోస్టులో కొండరెడ్ల గిరిజనుల సంక్షేమ అధికారిగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినందున ఐటీడీఏ కొండ రెడ్ల విభాగం అధికారిగా బాధ్యతలు తీసుకున్నానని, మారుమూల ప్రాంతాలలో నివసించే కొండ రెడ్ల గిరిజనుల కుటుంబాలకు నా వంతు సహకారం అందించి వారి అభివృద్ధికి సంక్షేమానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

## “బొంతలకోటి” ఖాతాలో మరో అవార్డు “నేషనల్ గ్లోరీ” అవార్డుకు ఎంపిక



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** గజపతినగరానికి చెందిన సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు బొంతలకోటి శంకర్రావు ఖాతాలో మరో అవార్డు చేరింది.ప్రతిష్టాత్మకమైన నేషనల్ గ్లోరీ అవార్డుకు బొంతలకోటి ఎంపికయ్యారు. దేశంలో ప్రముఖ వ్యక్తులకు ప్రధానం చేసే ప్రతిష్టాత్మక నేషనల్ గ్లోరీ అవార్డు 2025 సంవత్సరానికి గాను తనను ఎంపిక చేసినట్లు శంకర్రావు గురువారం విలేకరులకు తెలిపారు. ఐక్యరాజ్యసమితి గుర్తింపు పొంది, ముగ్గురు రాష్ట్రపతుల నుండి అవార్డులను అందుకున్న జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులతో కూడిన కమిటీ ఈ అవార్డుకు తనను ఎంపిక చేసిందన్నారు. ఈనెల 9వ తేదీన విశాఖపట్నంలో జరిగే ఒక ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖుల చేతుల మీదుగా అవార్డును స్వీకరించనున్నట్లు తెలిపారు. ఇంతవరకు 349 అవార్డులు అందుకోగా ఈ అవార్డు 350 వ అవార్డుగా అందుకోనున్నట్లు బొంతలకోటి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరామారావు, జిల్లా విద్యాశాఖధికారి యు.మాణిక్యం నాయుడు, జిల్లా ఉపవిద్యాశాఖధికారులు కె. మోహనరావు, బి. వి. రమణ, చైతన్యభారతి, లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ బొంతలకోటి శంకరరావుని అభినందించారు.

## ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి స్ఫూర్తిదాయకం

### -“ కె.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ట్రస్టీ” ప్రజా సేవకుడు, ప్రజా ప్రతినిధి



**నాయుడుపేట, (రాజధాని వార్తలు):** నెల్లూరు ఎమ్మెల్యే కోటమరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రజాసేవే నాకు స్ఫూర్తిదాయకమని తిరుపతి జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు వేలూరు మురళి కృష్ణారెడ్డి తనయుడు కె.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కళ్యాణ్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన పుట్టినరోజును నెల్లూరు నగరంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సమక్షంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయుడుపేట మండలంలోని గ్రద్దగుంట గిరిజన కాలనీలో రిటైర్డ్ వార్డెన్ శివప్రసాద్ సమక్షంలో 40 మంది గిరిజన మహిళలకు 14 రకాలతో కూడిన నిత్యావసర సరుకు కిట్‌లను పంపిణీ చేశారు. కళ్యాణ్ రెడ్డి అభిమానులు, పార్టీ నాయకుల మధ్య ఎమ్మెల్యే కోటంరెడ్డి ఆధ్వర్యంలో జన్మదిన వేడుక ఘనంగా జరుపుకున్నారు. పేదలకు సేవలందించడంలో కేఆర్ ట్రస్ట్ ముందుంటుందని వెల్లడించారు.

## పులికాట్ సరస్సును ఫ్లెమింగోకు శాశ్వతం : ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

**సూళ్లూరుపేట, (రాజధాని వార్తలు):** పులికాట్ సరస్సును ఫ్లెమింగోలకు శాశ్వత ఆశ్రయంగా మార్చే నిర్ణయంపై హర్షం ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పులికాట్ సరస్సును ఫ్లెమింగోలకు శాశ్వత ఆశ్రయంగా మరియు అంతర్జాతీయ ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ తీసుకున్న దార్శనిక నిర్ణయాన్ని సూళ్లూరుపేట శాసనసభ్యురాలు డా. నెలవల విజయశ్రీ హృదయపూర్వకంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఆమె ఉపముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.డా. నెలవల విజయశ్రీ మాట్లాడుతూ, పులికాట్ సరస్సు తమ నియోజకవర్గం పరిధిలో ఉన్న ఒక ముఖ్యమైన సహజ సంపద అని పేర్కొన్నారు. ఏటా లక్షలాది వలస పక్షులు, ముఖ్యంగా ఫ్లెమింగోలు ఇక్కడికి వస్తాయని, ఈ ప్రాంత జీవవైవిధ్యానికి ఇది ఎంతగానో దోహద పడుతుందని ఆమె తెలిపారు. పులికాట్‌ను కేవలం వలస కేంద్రంగా కాకుండా, ఫ్లెమింగోలకు శాశ్వత ఆశ్రయంగా మార్చే ఈ గొప్ప సంకల్పం 'ఎకో ఫ్రెండ్లీ టూరిజం' అభివృద్ధికి పునాది వేస్తుంది. ఇది పర్యావరణ పరిరక్షణతో పాటు, స్థానిక మత్స్యకార కుటుంబాలు మరియు యువతకు మెరుగైన ఉపాధి, వ్యాపార అవకాశాలను సృష్టిస్తుంది. ఈ నిర్ణయంతో పులికాట్‌కు ప్రపంచ పటంలో ప్రత్యేక స్థానం లభిస్తుంది," అని డా. నెలవల విజయశ్రీ అన్నారు. ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్‌కి సూళ్లూరుపేట నియోజకవర్గ ప్రజల తరఫున ఆమె మరోసారి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలలో తమ నియోజకవర్గం తరపున పూర్తి సహకారం అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

# టాక్సిక్ పై అంచనాలను పెంచేసిన రుక్మిణి





కన్నడ రాక్ స్టార్ యష్ హీరోగా తెరకెక్కుతున్న టాక్సిక్ మూవీ భారీ స్థాయిలో రూపొందుతున్న విషయం తెలిసిందే. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ మూవీ వచ్చే ఏడాది మార్చి 19న రిలీజ్ కానుందని మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేశారు. కానీ రీసెంట్‌గా ఈ సినిమా వాయిదా పడుతుందని సోషల్ మీడియాలో వచ్చిన వార్తలు నెట్టింట అందరి దృష్టిని ఆకర్షించాయి. వాయిదా వార్తలపై క్లారిటీ ఇచ్చిన టాక్సిక్ టీమ్ అయితే ఈ వార్తలను ఖండిస్తూ తమ సినిమా కచ్చితంగా మార్చి 19నే రిలీజ్ కానుందని మేకర్స్ చెప్పడంతో టాక్సిక్ రిలీజ్ విషయంలో అందరికీ క్లారిటీ వచ్చింది. ఇదిలా ఉంటే ఈ సినిమాలో కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్ ఓ కీలక పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. టాక్సిక్ కోసం రుక్మిణి ఇప్పటికే పలు షెడ్యూల్స్ షూటింగ్‌ను కూడా పూర్తి చేశారు. టాక్సిక్‌లో రుక్మిణి వసంత్ నటిస్తున్న విషయాన్ని చిత్ర యూనిట్ ఇంకా అధికారికంగా వెల్లడించనప్పటికీ రీసెంట్‌గా ఈ విషయమై రుక్మిణి ఓ హింట్ ఇచ్చారు. తాజాగా ఇన్‌స్టాలో ఫ్యాన్స్‌తో ఇంటరాక్ట్ అయిన రుక్మిణి టాక్సిక్ మూవీ వర్క్ ఎక్స్‌పీరియెన్స్‌ను షేర్ చేసుకోవడంతో పాటూ ఆ సినిమాను తెగ పొగిడేశారు. ఇప్పటివరకు కన్నడ, ఇండియన్ సినిమాలో చూడని విధంగా టాక్సిక్ రూపొందుతుందని, గీతూ ఈ మూవీని చాలా పకడ్బందీగా తెరకెక్కిస్తున్నారని చెప్పుకొచ్చారు. సినిమాలో నటించే ఎవరైనా ఇలాంటి వ్యాఖ్యలు చేసినప్పుడు సహజంగానే సగటు చిత్రంపై అంచనాలు పెరుగుతాయి. అందులోనూ రుక్మిణిలాంటి టాలెంటెడ్ నటి ఈ విషయాన్ని చెప్పడంతో టాక్సిక్‌లో ఆడియన్స్‌ను అంతగా ఎట్రాక్ట్ చేసే విషయమేంటో చూడ్డానికి ఆడియన్స్ చాలా ఎగ్జైటింగ్‌గా ఉన్నారు. కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో నయనతార, హుమా ఖురేసి, తారా సుతారియా కీలకపాత్రల్లో నటిస్తుండగా, కెవిఎన్ ప్రొడక్షన్స్ టాక్సిక్‌ను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది.

# ఎస్ఎస్ఎంబి 29 నుండీ పృథ్వీరాజ్ ఫస్ట్ లుక్ రిలీజ్!




స్టార్ డైరెక్టర్‌గా పేరు సొంతం చేసుకున్న రాజమౌళి ప్రస్తుతం మహేష్ బాబుతో ఎస్.ఎస్.ఎమ్.బి 29 అనే వర్కింగ్ టైటిల్‌తో సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. మహేష్ బాబు హీరోగా.. గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో మలయాళ స్టార్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. 2027 లో ఈ సినిమా విడుదల కాబోతున్నట్టు సమాచారం. ఈ సినిమా షూటింగ్ మొదలై చాలా రోజులే అవుతున్నా.. ఇప్పటికీ అప్డేట్ లేకపోవడంతో అభిమానులు నిరాశ వ్యక్తం చేశారు. అయితే అభిమానుల నిరాశకు తెర దింపుతూ.. నవంబర్ 15 నుంచి వరుస అప్డేట్స్ వదులుతానని రాజమౌళి ప్రకటించిన విషయం తెలిసిందే. హైదరాబాదులోని రామోజీ ఫిలిం సిటీ వేదికగా లక్షమంది సమక్షంలో గ్లోబ్ ట్రోటర్‌ను నవంబర్ 15న నిర్వహించబోతున్నారు. ఇక అప్పటినుంచి రోజుకు ఒక అప్డేట్ వదులుతానని రాజమౌళి తెలిపారు. కానీ అభిమానులను మళ్లీ వారం రోజులు వెయిట్ చేయించడం ఇష్టం లేక ఈరోజు ఈ సినిమాలో కీ రోల్ పోషిస్తున్న పృథ్వీరాజ్ సుకుమారన్‌కి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేస్తున్నట్లు అధికారికంగా ట్విట్టర్ ద్వారా వెల్లడించారు రాజమౌళి. రాజమౌళి ట్వీట్‌ను పృథ్వీరాజ్ సుకుమారన్ కూడా షేర్ చేస్తూ.. స్మైల్, లవ్ ఎమోజీలను పంచుకున్నారు. ఇక చెప్పినట్టుగానే ఈరోజు పృథ్వీరాజ్ సుకుమారన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో కుంభ అనే పాత్రలో పృథ్వీరాజ్ నటిస్తున్నట్లు వెల్లడించారు. తాజాగా విడుదల చేసిన పోస్టర్‌లో రెండు కాళ్లు పనిచేయని వ్యక్తిగా కనిపించిన పృథ్వీరాజ్ సుకుమారన్ ఒక పవర్ఫుల్ వీల్ చైర్ లో కూర్చున్నట్టు చూపించారు. ప్రస్తుతం ఈ పోస్టర్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మొత్తానికైతే ఒక్కొక్క అప్డేట్ వదులుకుంటూ వస్తానని చెప్పిన రాజమౌళి.. అందులో భాగంగానే మొదట పృథ్వీరాజ్ లుక్కును రిలీజ్ చేశారు. ఎస్ ఎస్ ఎం బి 29 సినిమా విషయానికి వస్తే.. యాక్షన్ అడ్వెంచర్ మూవీగా రాబోతున్న ఈ సినిమా దాదాపు విదేశాలలోనే షూటింగ్ జరుపుకుంటుంది. ముఖ్యంగా ఆఫ్రికన్ అడవులలో ఈ సినిమా షూటింగ్ ఎక్కువ భాగం జరుపుకున్నట్లు సమాచారం. కెన్యాలో కూడా ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. సుమారుగా 1200 కోట్ల బడ్జెట్తో ప్రముఖ నిర్మాత కేఎల్ నారాయణ శ్రీ దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా కూడా రెండు భాగాలుగా రాబోతోందని వార్తలు వినిపిస్తు న్నాయి. మహేష్ బాబు విషయానికి వస్తే.. ఇన్ని రోజులు టాలీవుడ్ విడిచి మరో భాషా చిత్రంలో నటించడానికి ఇష్ట పడని మహేష్ బాబు.. ఇప్పుడు ఏకంగా పాన్ ఇండియా కాదు ఏకంగా పాన్ వరల్డ్ మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. మరి ఈ సినిమాతో మహేష్ బాబు ఎలాంటి రికార్డ్స్ క్రియేట్ చేస్తారో చూడాలి.

# పెద్ది వీడియో సాంగ్: చికిరి చికిరి.. చరణ్ స్టెప్పుల కోసం మళ్ళీ మళ్ళీ చూసేలా..




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వస్తున్న భారీ చిత్రం 'పెద్ది'. ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తుండటంతో ఈ సినిమా ఆల్బమ్‌పై మొదటి నుంచి గై రేంజ్‌లో అంచనాలున్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి "చికిరి చికిరి" అంటూ సాగే మొదటి లిరికల్ వీడియో సాంగ్‌ను విడుదల చేశారు. మరి ఈ పాట ఆ అంచనాలను అందుకుందా లేదా అనే వివరాల్లోకి వెళితే.. ఈ పాటను మేకర్స్ రూరల్ బీట్స్, పాన్ వరల్డ్ వైబ్.. అంటూ ఆసక్తికరంగా ప్రమోట్ చేశారు. అంటే, పక్కా పల్లెటూరి సంగీతానికి, అంతర్జాతీయ స్థాయి ఫీల్‌ను జోడించారన్నమాట. ఈ పాట ద్వారా 'పెద్ది' ప్రపంచం ఎంత పచ్చిగా, వాస్తవికంగా ఉండబోతుందో బుచ్చిబాబు ఒక చిన్న జలక్ ఇచ్చారు. పాట వినగానే ఇది రెగ్యులర్ కమర్షియల్ బీట్ కాదని అర్థమవుతుంది. "ఆ చంద్రుల్లో ముక్క.. జారిందే దీనక్క.. నా ఒళ్ళంతా ఆడిందే తైతక్కా" అంటూ బాలాజీ రాసిన సాహిత్యం చాలా రూటెడ్‌గా, కాస్త వింతగా అనిపిస్తుంది. ఇలాంటి పక్కా జానపద స్టైల్ పాటకు మోహిత్ చౌహాన్ లాంటి సాఫ్ట్, మెలోడీ వాయిస్ ఉన్న సింగర్‌ను ఎంచుకోవడం ఏ.ఆర్. రెహమాన్ చేసిన పెద్ద ప్రయోగం. ఈ పాట వినగా వినగా నచ్చే 'స్లో పాయిజన్' తరహా ట్యూన్‌లా ఉందని మరికొందరు అంటున్నారు. ముఖ్యంగా విజువల్స్ మాత్రం ఫ్యాన్స్‌కు అసలైన ట్రీట్. రామ్ చరణ్ పూర్తి మేకోవర్‌తో, గడ్డం, పొడవాటి జుట్టుతో చాలా రఫ్ అండ్ రస్టిక్ లుక్‌లో కనిపించారు. ముఖ్యంగా జానీ మాస్టర్ కొరియోగ్రఫీకి చరణ్ వేసిన ఎనర్జిటిక్ స్టెప్స్, ఆయన బాడీ లాంగ్వేజ్ పాటను విజువల్‌గా మరో స్థాయికి తీసుకెళ్లాయి. చరణ్ డ్యాన్స్ కోసమే ఈ పాటను మళ్లీ మళ్లీ చూసేలా ఉంది. హీరోయిన్ జాన్వీ కపూర్ కూడా పల్లెటూరి గెటప్‌లో, లంగావోణీలో అందంగా కనిపించింది. రత్నవేలు సినిమాటోగ్రఫీ ఆ పల్లెటూరి వాతావరణాన్ని, కొండల నడుమ లొకేషన్లను అద్భుతంగా బంధించింది. రెహమాన్, మోహిత్ చౌహాన్‌లను పియానోతో చూపించిన షాట్స్ పాన్ వరల్డ్ వైబ్‌ను సూచిస్తున్నాయి. ఫైనల్‌గా, 'చికిరి చికిరి' పాట.. ఆడియో పరంగా ఒక ప్రయోగం అయితే, విజువల్స్ పరంగా ముఖ్యంగా చరణ్ డ్యాన్స్ ప్రేక్షకులను వెంటనే ఆకట్టుకునేలా ఉంది. ఇక ఈ చిత్రం 2026 మార్చి 27న విడుదల కానుంది.

# 8 ఏళ్ల నుంచి హిట్టు లేదు.. రష్మిక సినిమా అయినా గట్టెక్కిస్తుందా?




ఇండస్ట్రీలో నిలదొక్కుకోవాలంటే అందం, అభినయం మాత్రమే సరిపోవు, కొంచెం అదృష్టం కూడా కావాలి. ఈ మాట బహుశా నటి అను ఇమ్మాన్యుయేల్‌కు సరిగ్గా సరిపోతుందేమో. చూడగానే ఆకట్టుకునే రూపం, నటనకు అవకాశం ఉన్న పాత్రలు దొరికినా.. ఆమె కెరీర్ ఎందుకో గాడిలో పడలేకపోతోంది. 2016 లో న్యాచురల్ స్టార్ నాని సరసన 'మజ్ను' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది ఈ మలయాళీ బ్యూటీ. ఆ సినిమాలో కిరణ్మయి పాత్రలో చక్కగా నటించి, మొదటి సినిమాతోనే మంచి మార్కులు కొట్టేసింది. ఈమెకు ఇండస్ట్రీలో మంచి భవిష్యత్తు ఉంటుందని అందరూ అనుకున్నారు. కానీ, 'మజ్ను' తర్వాత ఆమె వేసిన అడుగులు సరైన ఫలితాన్ని ఇవ్వలేదు. 'కిట్టు ఉన్నాడు జాగ్రత్త', 'ఆక్సిజన్' వంటి సినిమాలు నిరాశపరిచాయి. ఆ తర్వాత ఏకంగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్‌తో 'అజ్ఞాతవాసి', స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్‌తో 'నా పేరు సూర్య' లాంటి భారీ అవకాశాలు వచ్చాయి. దురదృష్టవశాత్తూ, ఆ రెండు భారీ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద దారుణంగా ఫ్లాప్ అయ్యాయి. ఆ దెబ్బకు ఆమె కెరీర్ ఒక్కసారిగా వెనకపడింది. ఆ తర్వాత 'శైలజారెడ్డి అల్లుడు' ఫరవాలేదనిపించినా, 'మహా సముద్రం', 'రావణాసుర' వంటి సినిమాలు కూడా ఆమెకు ఏమాత్రం కలిసిరాలేదు. దీంతో ఆమెకు మెయిన్ హీరోయిన్‌గా అవకాశాలు పూర్తిగా తగ్గిపోయాయి. ఇలాంటి క్లిష్ట సమయంలో, ఆమె ఇప్పుడు 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో రష్మిక మందన్న టైటిల్ రోల్ పోషిస్తున్న ఈ చిత్రంలో, అను ఇమ్మాన్యుయేల్ కీలక పాత్రలో నటించింది. అయితే, ఇది మెయిన్ లీడ్ కాదు, సినిమాలో రెండో ముఖ్యమైన మహిళా పాత్ర అని స్పష్టంగా తెలుస్తోంది. కెరీర్ ఆరంభంలో అగ్ర హీరోల సరసన నటించినా దక్కని విజయం, ఇప్పుడు ఇలా సెకండ్ లీడ్‌గా చేస్తున్న పాత్రతో అయినా వస్తుందో లేదో చూడాలి. ఒక్కోసారి మెయిన్ లీడ్ కంటే.. ఇలాంటి కీలక పాత్రలే నటీనటులకు ఎక్కువ పేరు తెచ్చిపెడతాయి. మరి, 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా అను ఇమ్మాన్యుయేల్ కెరీర్‌కు ఆశించిన 'సక్సెస్' ఇస్తుందో లేదో తెలియాలంటే మరికొన్ని గంటలు ఆగాల్సిందే.

# పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం ఎంతో ముఖ్యం

## - తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య





**భద్రాచలం, (రాజధాని వార్తలు):** పర్యావరణ పరిరక్షణలో భాగంగా "గ్రీన్ భద్రాద్రి" ఆధ్వర్యంలో, భద్రాచలం పట్టణంలోని క్రాంతి విద్యాలయాల యాజమాన్య సౌజన్యంతో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీరయ్య "అడవులు రోజురోజుకీ తగ్గిపోతుండటంతో పర్యావరణానికి పెను ముప్పు ఏర్పడుతోంది. భవిష్యత్ తరాలకు సురక్షితమైన వాతావరణం అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంలో భాగస్వాములు కావాలి" అని అన్నారు. విద్యార్థులు మరియు పెద్దలందరికీ మొక్కల ప్రాధాన్యత, పర్యావరణ సంరక్షణ ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమం గ్రీన్ భద్రాద్రి భద్రాచలం అధ్యక్షురాలు లలిత ఆధ్వర్యంలో, క్రాంతి స్కూల్ విద్యాలయాల కరస్పాండెంట్ సమత శ్రీనివాస్ సౌజన్యంతో నిర్వహించబడింది.

కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి కార్యవర్గ సభ్యులు శంకర్రావు, తిప్పన సిద్ధులు, డాక్టర్ విజయ రావు, డాక్టర్ రామకృష్ణ, ఉ ప్పాడ రాంప్రసాద్ రెడ్డి, అడ్వకేట్ తిరుమల రావు పాల్గొన్నారు. అలాగే భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొదెం వీరయ్యతో పాటు, భద్రాచలం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరిమి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు తమ్ముల్ల వెంకటేశ్వర్లు, ఐఎన్టీయూసీ సింగ్ శ్రీనివాస్, మాధవరావు, బత్తుల సాంబయ్య, వాసిరెడ్డి సాంబశివరావు, కోళ్లపూడి వరుణ్, శీలం రామ్మోహన్ రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకుడు మణికంఠ, మైనార్టీ సెల్ అలీమ్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు పందాల సరిత తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ పోరులో అసువులు బాసిన ధ్రువతార భారతి మాదిగ 8వ వర్ధంతి

## - దళితుల ఆత్మ గౌరవం కై నవంబర్ 17న చలో ఢిల్లీ



**భద్రాచలం, (రాజధాని వార్తలు):** స్థానిక ఉదయ్ హాస్పిటల్ నందు మాదిగ డాక్టర్ల, మాదిగ మేధావుల, మాదిగ ఉద్యోగస్తుల, మాదిగ మహిళల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాని కి మాజీ ఎంఆర్పిఎస్ నాయకులు అలవాల రాజా పెరియార్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి డాక్టర్ ఉదయ్, డాక్టర్ కౌసన్య, డాక్టర్ కిరణ్, ఈటె రాజేశ్వరరావు, నారపొంగు శ్రీనివాస్, దేపంగి రమణయ్య మాదిగ, దేపంగి గోపాల కృష్ణ, మేకల లత, చిట్యాల రజిత, నదిపింటి మధులు మాట్లాడుతూ... మాదిగలు సమాజహితం కోరే వారని, సామాజిక న్యాయం కోసం పోరాటం చేశారని, మాదిగలు అన్ని రంగాల్లో ముందుండాలని, సమాజంలో అంటరానితనాన్ని, అవమానాన్ని వివక్షతను చిన్నతనం నుండే అనుభవించామని, గురువారం ఉన్నత స్థానంలో ఉన్నామంటే మహనీలు ఇచ్చిన స్ఫూర్తే కారణమని అన్నారు. డాక్టర్లుగా, ఉద్యోగస్తులుగా ఎన్ని సేవలు చేసిన కులం కారణంగా వివక్షతల గురవుతున్నామని గుర్తు చేశారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపులో భాగంగా 2017 న కలెక్టరేట్ కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో పాల్గొని హక్కుల సాధన కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అప్పటి ప్రభుత్వ అధికార మదానికి, పోలీసుల లాఠీ దెబ్బలకు బలైన మహాజన ఆణి ముత్యం భారతి మాదిగ కు ఘన నివాళులర్పించారు. అదేవిధంగా దళితుల ఆత్మకూరు కోసం నవంబర్ 17న ఢిల్లీలో జరిగే కార్యక్రమానికి యువకులు విద్యార్థులు ఉద్యోగస్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం ఈ ఎఫ్ నాయకులు కోటమర్తి శ్రీనివాస్, దేపంగి రామకృష్ణ, మిరియాల రాము, చెక్క నర్సింహారావు, దేపంగి నర్సింహ రావు, ఎంఆర్పిఎస్ నాయకులు కొమ్ము హుస్సేన్ మాదిగ, కొమ్మగిరి వెంకటేశ్వర్లు మాదిగ, చెన్నం కృష్ణ మాదిగ, రావులపల్లి ఈశ్వరయ్య మాదిగ, పొదుతూరి శంకర్ మాదిగ, మానవహక్కుల నేత, వికలాంగుల నాయకులు కిష్టా శ్రీనివాస్, అన్నం సత్తిబాబు, ఎంఎంఎస్ నాయకులు కొప్పుల నాగమణి, నాగదేవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ మెడికల్ కాలేజీలో కాడావెరిక్ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహణ





**కొత్తగూడెం, (రాజధాని వార్తలు):** కొత్తగూడెం ప్రభుత్వ మెడికల్ కాలేజ్ తమ కొత్త బ్యాచ్ వైద్య విద్యార్థుల కోసం కాడావెరిక్ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమం ప్రతి వైద్య విద్యార్థి విద్యా ప్రయాణంలో ఒక విశిష్టమైన మైలురాయిగా నిలుస్తుంది. మానవ దేహం పట్ల గౌరవం, బాధ్యత మరియు వైద్య నైతికత పట్ల అవగాహనను పెంపొందించడంలో ఈ కార్యక్రమం ముఖ్య పాత్ర పోషిస్తుంది అని ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీ హరిరావు అన్నారు. వైద్య విద్యా ప్రక్రియలో మానవ దేహం చేసిన అపారమైన సహకారాన్ని గుర్తుచేస్తూ, ఈ కార్యక్రమం భవిష్యత్ వైద్య నిపుణుల్లో మానవతా విలువలను నాటే ప్రేరణగా నిలిచింది. కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు సమిష్టిగా కాడావెరిక్ ప్రమాణం స్వీకరించి, శరీరదాతల దేహాలను అత్యున్నత గౌరవం, గాంభీర్యం మరియు సమగ్రతతో చూడాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా శరీర దాతల నిస్వార్థ సేవలకు గౌరవ సూచకంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉప ప్రిన్సిపల్ మాట్లాడుతూ, శరీర దానం యొక్క పరమార్థం మరియు మానవతా ప్రాధాన్యతను ప్రత్యేకంగా వివరించారు. శరీర దానం మానవత్వానికి చిహ్నమని, దాతలు సమాజానికి అందిస్తున్న ఈ నిబద్ధత వైద్య విద్యా అభివృద్ధికి మూల స్తంభమని పేర్కొన్నారు.

కళాశాల వైద్య విద్యా పరిశోధనలకు తమ అమూల్య దేహదానం ద్వారా సహకరించిన దాతల కుటుంబాలకు కళాశాల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది. ప్రజల్లో మానవతా సేవ పట్ల చైతన్యాన్ని పెంపొందించి, దేహదా నం అనే మహోన్నత కర్మకు ప్రేరేపించడంలో సంస్థ అంకితభా వంతో ఉందని ఉప ప్రిన్సిపల్ తెలిపారు. అదేవిధంగా, మా కళాశాలకు శరీర దానం కార్యక్రమంలో నిరంతర మద్దతు అందించిన రఘాన్సిరాణి కంటి మరియు శరీర దానం ట్రస్ట్‌కు మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. వారి అవగాహన కార్యక్రమాల ద్వారా కళాశాలకు శరీర దానాలు పెరిగి, వైద్య విద్యార్థులకు అనుభవాధారిత విద్యకు దోహదం అవుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఓ డి అనాటమీ డాక్టర్ ప్రసన్న, వైద్య కళాశాల ఉపాధ్యాయులు సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మోడల్ అంగన్‌వాడీ రూపకల్పనలో భాగస్వామ్యం అవ్వండి - జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపు




**కొత్తగూడెం, (రాజధాని వార్తలు):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునికంగా, సురక్షితంగా, పిల్లల స్నేహపూర్వక వాతావరణంగా తీర్చిదిద్దే లక్ష్యంతో "మోడల్ అంగన్‌వాడీ డిజైన్ ఛాలెంజ్" కార్యక్రమాన్ని ప్రారంభించామని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఒక ప్రకటన లో తెలిపారు. జిల్లాలో ఉన్న ప్రస్తుత అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించినప్పుడు, సౌకర్యాలు, భద్రత, సౌందర్యం, ప్రాప్యత మరియు పర్యావరణ స్థిరత్వం వంటి అంశాలలో మెరుగుదల కు విస్తృత అవకాశాలు ఉన్నట్లు గుర్తించామని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, ప్రారంభ బాల్య సంరక్షణ మరియు విద్య కోసం అంగన్‌వాడీల ను ఆదర్శ ప్రదేశాలుగా అభివృద్ధి చేయడమే ఈ డిజైన్ ఛాలెంజ్ ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ వివరించారు. డిజైన్ రూపకల్పనకు మొత్తం వ్యయం రూ.12 లక్షల నుండి రూ.20 లక్షల మధ్య (కన్సల్టెన్సీ ఫీజులతో సహా) ఉండాలని సూచించారు. బిల్ట్‌అప్ ఏరియా సుమారు 600 చదరపు అడుగులు ఉండి, ఆట స్థలం, అధ్యయన ప్రాంతం, వంటగది, నిల్వ గది మరియు టాయిలెట్ వంటి అన్ని అవసరమైన సదుపాయాలు కలిగి ఉండాలని చెప్పారు. అలాగే ఈ డిజైన్ 30-40 మంది పిల్లలు మరియు 10 మంది పెద్దలు సౌకర్యవంతంగా ఉపయోగించగల విధంగా ఉండాలని సూచించారు. డిజైన్ సమర్పించే ఆర్కిటెక్టులు మరియు కన్సల్టెంట్లు ప్రాజెక్ట్ రూపకల్పనతో పాటు అమలు దశలో సాంకేతిక సహకారం అందించగల సామర్థ్యం కలిగి ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎంపికైన ఉత్తమ డిజైన్ జిల్లాలోని ఇతర అంగన్‌వాడీ కేంద్రాలకు నమూనా ప్రాజెక్టుగా ఉపయోగించబడుతుందని తెలిపారు. డిజైన్ ప్రతిపాదనలను 2025 నవంబర్ 12 సాయంత్రం 5 గంటలలోగా సమర్పించవలసి ఉంటుందని చెప్పారు. ఆసక్తి గల ఆర్కిటెక్టులు తమ ప్రతిపాదనలు collector-bdd@telangana.gov.in అనే ఇమెయిల్‌కి పంపవచ్చని తెలిపారు. సమర్పించిన ప్రతిపాదనలను జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సంబంధిత శాఖల సాంకేతిక నిపుణులతో కూడిన కమిటీ పరిశీలించనుంది. మూల్యాంకన సమయంలో కార్యాచరణ, ఆవిష్కరణ, స్థానిక పదార్థాల వినియోగం, ఖర్చు సమర్థత, స్థిరత్వం మరియు ప్రతిరూపణ సాధ్యత వంటి అంశాలు పరిగణనలోకి తీసుకోబడతాయని ఆయన పేర్కొన్నారు. కమిటీ తీసుకునే నిర్ణయం తుది నిర్ణయంగా పరిగణించబడుతుంది. జిల్లాలోని చిన్నారుల అభివృద్ధి, భద్రత, సృజనాత్మక వాతావరణం మరియు విద్యా నాణ్యత పెంపు కోసం అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి అత్యంత ప్రాధాన్యమైందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్య భావనతో ఆర్కిటెక్టులు, ఇంజనీర్లు, డిజైన్ నిపుణులు ఈ డిజైన్ ఛాలెంజ్‌లో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం జిల్లాలో ఆవిష్కరణాత్మక దృక్పథానికి దోహదం చేసి, చిన్నారుల కోసం సురక్షితమైన మరియు స్ఫూర్తిదాయకమైన నేర్చుకునే వాతావరణాన్ని సృష్టించడంలో మైలురాయిగా నిలుస్తుందని కలెక్టర్ తెలిపారు.

# మానవత్వం చాటుకున్న ఫ్లవర్ మర్చంట్ యూనియన్

**ఖమ్మం, (రాజధాని వార్తలు):** పేదింటి పూల వ్యాపారి కూతురు పెళ్లికి ఆర్థిక సహాయం నిత్యావసర వస్తువులు అందించిన ఖమ్మం టౌన్ ఫ్లవర్ మర్చంట్ యూనియన్ కమిటీ సభ్యులు గురు వారం యూనియన్ ఖమ్మం టౌన్ కార్యాలయం నందు డి.శ్రీనివాస్ నాయక్ (లేటు) డి.మంగమ్మ కూమార్తె పెళ్ళి జరగనున్న సందర్భంగా రూ.15000/-ల రూపాయలు నగదు మరియు అరక్వింటా బియ్యం నిత్యావసర వస్తువులు అందించి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు షేక్. మోయిన్, షేక్. ఖాజా మాట్లాడుతూ గత 40 సంవత్సరాల నుండి కమాన్ బజార్ రావిచెట్టు దగ్గర పూల వ్యాపారం చేస్తున్న డి.శ్రీనివాస్ నాయక్ (లేటు) డి.మంగమ్మ నిరుపేద కుటుంబం పూల వ్యాపారంతో జీవనం కొనసాగిస్తున్నారని వారి కుమార్తె వివాహానికి ఆర్థిక సహాయం అందించామని ఈవిధమైన సాయ సహాకారలు ఖమ్మం నగరంలో పూలవ్యారం చెస్తున్న వారికి అనేక విధాలుగా అందిస్తూ ఖమ్మం ఫ్లవర్ మర్చంట్ యూనియన్ అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం టౌన్ ఫ్లవర్ మర్చంట్ యూనియన్ కోశాధికారి షేక్ షాబాజ్ అహ్మద్, జాయింట్ సెక్రెటరీ ఆర్.వెంకన్న, కన్వీనర్ మహమ్మద్ ముజాహిద్, ఇంచార్జ్ షేక్ ఇస్మాయిల్, సిపిఐ నాయకులు డుంగ్రోతు. శేఖర్ నాయక్, షేక్. లాల్ బి తదితరులు పాల్గొన్నారు.

# పరోపకారంతోనే మానవ జన్మ సార్థకం

**- దీపం పరబ్రహ్మ స్వరూపం, దీప ప్రజ్వలన మంగళకరం - తాను కాలిపోతూ వెలుగు ప్రసాదించే దీప కాంతిలో పరోపకారం అన్న గొప్ప సందేశం దాగి వుంది - సకల ప్రాణులలో ఉత్తమమైనది మానవ జన్మ - కార్తీక మాసంలో ఆకాశం దీప ప్రజ్వలన అనాదిగా వస్తున్న సనాతన సాంప్రదాయం - సమస్త ప్రాణులకు ఉపకారం చేయడమే కార్తీక మాస ప్రత్యేకత - కార్తీక పౌర్ణమిలో దీపారాధన సంకట విమోచనకు మార్గం - పంచేంద్రియాలని నియంత్రించేది ఆత్మదీపం**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సృష్టిలోని 84 లక్షల జీవరాసులలో మానవ జన్మ ఉత్తమమైనది అన్నారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు. నెల్లూరు నగరంలోని విఆర్ కళాశాల మైదానంలో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లక్షదీపోత్సవ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు తమ ఆధ్యాత్మిక సందేశాన్ని వినిపించారు. కార్తీక మాస విశిష్టను ఆయన భక్త జనానికి వివరించారు. కార్తీక మాసంలో ఆకాశం దీప ప్రజ్వలన అనాదిగా వస్తున్న సనాతన సాంప్రదాయమంటూ ఆకాశంలోని పక్షులకు సూర్యాస్తమయంలో దారి చూపేందుకు వెలిగించిన ఆకాశదీప పురాణ ఇతివృత్తాన్ని ఆయన వివరించారు. పరోపకారంతోనే మానవ జన్మ సార్థకం అవుతుందన్నారు. మనిషిలోని అన్ని అవయవాలలో కళ్ళు ప్రధానమని సర్వేంద్రియానం నయనం ప్రధానం అన్న ఆర్యోక్తిని సార్థకం చేస్తూ విపిఆర్ నేత్ర అనే బృహుత్ కార్యాన్ని తలపెట్టి వేలాది మందికి కంటి వెలుగు ప్రసాదిస్తున్న వేమిరెడ్డి దంపతుల ఔదార్యాన్ని చాగంటి వారు ప్రశంసించారు. విద్య, వైద్యం, వికాసం తదితర రంగాలలో విపిఆర్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలను ఆయన కొనియాడారు.

దీపం ప్రజ్వలన చేయ కుండా ఏ పూజ చేయరని ఈ సృష్టిలోని అద్భుతాలు చూసేందుకు కళ్ళు ప్రదానం చేసినందుకు కృతజ్ఞతగా పూజలో దీపారాధన చేస్తారని చాగంటి వారు సెలవిచ్చారు. సంపదను సమాజ సేవకు వినియోగించడం స్వర్గ ప్రవేశానికి అర్హత లాంటిదన్నారు. తాను కాలిపోతూ వెలుగు ప్రసాదించే దీప కాంతిలో పరోపకారం అన్న గొప్ప సందేశం దాగుందన్నారు. పరోపకార గుణం లేని జీవితం వ్యర్థమని చాగంటి వారు వెల్లడించారు. కార్తీక మాసంలో దీపా రాధన గొప్ప పుణ్య కార్యమని ఆయన తెలిపారు. కార్తీక మాసంలో ఆవు నెయ్యి, నువ్వుల నూనెతో వెలిగించే దీపం కారణంగా హాని చేసే కొన్ని రకాల విష పురుగులు నశించిపోతాయని మన దేశంలో జరిపే దీపారాధన ఆచారంపై పరిశోధన జరిపి లైట్ థెరపి అంటూ గ్రీస్ దేశ శాస్త్రవేత్త నిర్ధారించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. సనాతన ధర్మంలో గోవుకు వున్న విశిష్టత వివరిస్తూ గోవు మల మూత్రాలు సైతం పరమ పవిత్రమైనవని పేర్కొన్నారు. శివకేశవుల మధ్య ఎలాంటి భేదాలు లేవని చాటి చెప్పడం కూడా కార్తీక మాస ప్రత్యేకతలలో ఒకటన్నారు.

**కమనీయం భస్మాభిషేకం**

ప్రవచనం అనంతరం అత్యంత భక్తిశ్రద్ధలతో మహా శివలింగానికి నిర్వహించిన భస్మాభిషేకం.. ఆద్యంతం తన్మయత్వాన్ని కల్పించింది. పాలు, పెరుగు, నెయ్యి, పసుపు, కుంకుమ, వివిధ రకాల పుష్పాలు, విభూదితో నిర్వహించిన భస్మాభిషేకం... సాక్షాత్తు కైలాసాన్ని తలపించింది. భక్తుల శివనామస్మరణ మధ్య ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచింది. భక్తుల హర్షధ్వానాల మధ్య అలౌకిక అనుభూతిని అందించింది.

# రైతు పక్షానే ప్రభుత్వం ఉంటుంది

## - యూరియా వినియోగంపై రైతుల్లో అవగాహన కలిగించాలి - మంత్రి కొండపల్లి - వైద్య కళాశాలల విషయంలో పిపి మోడల్‌తో ప్రయోజనం - మంత్రి గుమ్మిడి సంధ్యారాణి - 35 శాతం లోపల జరిగిన పంట నష్టాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి : జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు - జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో మెడికల్ కళాశాల, పంట నష్ట పరిహారంపై చర్చ





**విజయనగరం, (రాజధాని వార్తలు):** మోన్థా తుఫాన్‌కు నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం అందిస్తామని రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ, ఎన్.ఆర్.ఐ వ్యవహారాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. తుఫాన్ హెచ్చరికలు అందిన నుండే ముందస్తు చర్యలు తీసుకొని రాష్ట్రమంతటా అప్రమత్తం చేయడం జరిగిందని, ఈ చర్యల వల్లనే తుఫాన్ నష్టాలను తగ్గించగలిగామని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం రైతు పక్షానే ఉంటుందని, రైతు సమస్యలపై ప్రభుత్వం నుండి అన్ని రకాలుగా సహకారం ఉంటుందని అన్నారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి, కురుపాం ఎం.ఎల్.ఏ మరియు ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, విజయనగరం, మన్యం జిల్లాల కలెక్టర్లు ఎస్. రాంసుందర్ రెడ్డి, డా.ఎన్ .ప్రభాకర్ రెడ్డి, విజయనగరం జే.సి సేదు మాధవన్, పార్వతీపురం సబ కలెక్టర్ డా.ఆర్. వైశాలి పాల్గొన్నారు. ధాన్యం సేకరణ పై జరిగిన చర్చలో భాగంగా జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు మాట్లాడుతూ 35 శాతంకన్నా ఎక్కువ పంట నష్టం జరిగితేనే నమోదు చేస్తున్నారని, అంతకన్నా తక్కువ జరిగిన వారి పరిస్థితేంటని ప్రశ్నించారు. ఇప్పటికీ పంట కొంత మేరకు నీటిలో మునిగి ఉందని, ధాన్యం రంగు మారే అవకాశం ఉందని, వాటిని ఏ విధంగా కోనుగోలు చేస్తారో రైతులకు వివరించాలని కోరారు. అలాగే 30 శాతం లోపల నష్టం జరిగిన వారి వివరాలను కూడా నమోదు చేసి ప్రభుత్వం దృష్టిలో పెట్టాలని, వారికీ నష్ట పరిహారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పంట నష్టాలను నమోదు చేసేటప్పుడు భౌతికంగా పంట ను తనిఖీ చేసి నమోదు చేయాలనీ, ఎవరో చెప్పారని నమోదు చేయ కూడదని తెలిపారు. వీలైతే పంట నష్ట నష్టాలను నమోదు తేదీలను పొడిగించాలని కోరారు. అలాగే గోనె సంచులు ప్రభుత్వం సరఫరా చేస్తుందా లేక రైతులే సమకుర్చుకోవాలా స్పష్టంగా చెప్పాలన్నారు. జే.సి సేదు మాధవన్ స్పందిస్తూ జిల్లాకు కోటి గోనె సంచులు అవసరం అవుతాయని, ప్రస్తుతం జిల్లా స్థాయిలో 50 లక్షల వరకు సర్దుబాటు అవుతున్నాయని, మిగిలిన వాటి కోసం ప్రభుత్వం స్థాయిలో చర్చ జరుగుతోందని తెలిపారు. మంత్రి కొండపల్లి మాట్లాడుతూ అవసరమైన కంటే ఎక్కువ మోతాదులో రైతులు యూరియా వినియోగిస్తున్నారని, యూరియా ఎక్కువగా వినియోగించడం వలన కాన్సర్ వంటి వ్యాధులు వస్తున్నాయని, రైతులకు యూరియా వినియోగంపై అవగాహన కలిగించాలని తెలిపారు. ప్రజల ఆరోగ్యం ముఖ్యమని, దీనిని రాజకీయం చేయకూడదని మంత్రి అన్నారు. అధికంగా నిల్వ చేసుకోవడం వలన జిల్లాలో యూరియా కొంత లోటు ఏర్పడినప్పటికీ ప్రభుత్వం యూరియా సరఫరా సకాలంలో చేయడం జరిగిందని తెలిపారు. వైద్య శాఖలో చర్చ సందర్భంగా పలువురు జెడ్.పిటి సి లు, ఎం.పి.పి లు మాట్లాడుతూ గత ప్రభుత్వం 17 మెడికల్ కాలేజీలను మంజూరు చేస్తే ఈ ప్రభుత్వం వాటిని ప్రైవేటు మోడల్‌కు తేవడం బాధాకరమని, పేద ప్రజలకు వైద్యం దూరం అవుతుందని ఆవేదన వ్యక్తం చేరు. మెడికల్ కళాశాలల్లో గత ప్రభుత్వం మంజూరు చేసిన పాలసీని కొనసాగించాలని, ప్రైవేటు భాగస్వామ్యంతో నష్టం జరుగుతుందని తెల్పారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పందిస్తూ పిపి అపేదే లేదని, ఈ విధానం ప్రజలకు, పేదలకు ప్రయోజనమని భావించి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని అన్నారు. దీనివలన పేదలకు మెడికల్ సీట్లు పెరుగుతాయని, ఉచిత, నాణ్యమైన వైద్యం అందుతుందని తెలిపారు. ఎం.ఎస్.ఎం.ఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విజయనగరం మెడికల్ కాలేజీ ప్రారంభం అయినప్పటికీ ఇంకనూ 600 కోట్ల రూపాయలను ఖర్చు చేయవలసి ఉందని, ఆ విధంగా అన్ని కాలేజీలకు వేల కోట్లను ఖర్చు చేయవలసి ఉంటుందని, ఇది ప్రభుత్వానికి భారం అవుతుందని, ప్రజలకు అందించే సౌకర్యాలలో ఎటువంటి లోపం లేకుండా చూస్తామని, ప్రైవేటు పబ్లిక్ భాగస్వామ్యం అందరికీ ఆమోదయోగ్యమని పేర్కొన్నారు. కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తారని వై.సి.పి నాయకులూ ప్రశ్నించగా మంత్రి కొండపల్లి మాట్లాడుతూ దరఖాస్తులను తీసుకోవడం జరుగుతోందని, దీనిపై త్వరలో నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. భోగాపురం ఎం.పిపి మాట్లాడుతూ రావాడ పంచాయతిలోకి ఎయిర్పోర్ట్ నుండి నీటిని పంపడంతో గ్రామంలో కాలు పెట్టలేని పరిస్థితి నెలకొందని, దీనికి పరిష్కారం కావాలని తెలుపగా జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి స్పందిస్తూ ఈ సమస్య తన దృష్టికి వచ్చిందని, ఇరిగేషన్, రెవిన్యూ, ఎయిర్పోర్ట్ అధికారులతో కలిసి టీం వర్క్ జరగవలసి ఉందని, త్వరలో ఈ సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో శాసన మండలి సభ్యులు డా.సురేష్ బాబు, ఎం.ఎల్.ఏలు అదితి గజపతి రాజు, కోళ్ళ లలిత కుమారి, లోకం నాగమాధవి, డి.సి.ఎం.ఎస్. చైర్మన్ గొంప కృష్ణ , కాపు కార్పొరేషన్ చైర్పర్సన్ పాలవలస యశస్వి, పలు సమస్యలపై మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సి.ఈ.ఓ సత్యనారాయణ, రెండు జిల్లాలకు చెందిన అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత కోడిగుడ్లు పంపిణీ







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పౌల్ట్రీ పితామహుడు పద్మశ్రీ డాక్టర్ బి వి రావు 90 వ జయంతి మరియు నెక్ డే సందర్భంగా ఉడికించిన కోడిగుడ్లు వాకర్స్‌కు క్రీడాకారులకు 500 గుడ్లు ఇవ్వటం జరిగింది. కోడి గుడ్డులో ఉన్న విలువలను గురించి కరపత్రం డాక్టర్ కె బాల స్వామి సౌజన్యంతో అందరికి ఇవ్వటం జరిగినది.

ప్రెసిడెంట్ కిలారి శ్రీనివాసులు నాయుడు, సెక్రటరీ గువ్వల నారాయణరెడ్డి, ట్రెజరర్ మాగంటి ప్రసాద్, ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరా మయ్య నాయుడు, దాతగా బెజవాడ సునీల్ రెడ్డి, ఎస్కే నసీర్ అహ్మద్, బెల్లం చెంచయ్య నాయుడు, బిరదవోలు రామ మోహన రెడ్డి, కాగోళ్ల శివయ్య, ఏకొల్లు రాఘవరెడ్డి, కె వెంకటరమణ, శానం పూడి సుబ్బరాయుడు, నైజాం వెంకటేశ్వర్లు, పులగల సుబ్బారావు, వినుకొండ వెంకటేశ్వర్లు, బి సదా నంద రెడ్డి, పత్తి పాటి రమణయ్య, ఇ సోను, వి ఆది నారాయణరెడ్డి, లక్కాకుల శ్రీనివాసులు, ఎన్ శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# డేటా ఆధారంగా సుపరిపాలన : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

## - వర్చువల్‌గా హాజరైన మంత్రి కొండపల్లి, కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి






**విజయనగరం, (రాజధాని వార్తలు):** డేటా ఆధారంగా సుపరి పాలన అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయం నుండి గురువారం మధ్యాహ్నం 'డేటా ఆధారిత పాలన' అంశంపై ఉన్నతస్థాయి సదస్సు జరిగింది.

వివిధ ప్రభుత్వ శాఖలు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేశాయి. ఈ సదస్సులో సీఎం మాట్లాడుతూ డేటా ఆధారంగా చేసే పరిపాలన వల్ల కలిగే ప్రయోజనాలను వివరిం చారు. ఇటీవల వచ్చిన మోంథా తుఫానును సమర్థంగా ఎదుర్కోవడానికి డేటా ఎంతగానో ఉపయోగపడిందని చెప్పారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాల్సిన ఆవశ్యకత ప్రతీ శాఖపైనా ఉందని స్పష్టం చేశారు. వాట్సప్ గవర్నెన్స్‌లో భాగంగా శత శాతం ఆన్లైన్ సేవలను అందించమని ఆదేశించారు.

గ్రామ సచివాలయాలను విజన్ యూనిట్స్‌గా మారుస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలు నుంచి రాష్ట్ర ఎంఎస్ఎం ఈ, సెర్ప్, ఎన్నారై సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొం డపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర రెడ్డి, డీఆర్వో శ్రీనివాసమూర్తి, సిపివో పి.బాలాజీ తదితర జిల్లా ఉన్నతాధికారులు వర్చువల్‌గా పాల్గొన్నారు.

# కొండకరకం గ్రామంలో సీతం ఎన్. ఎస్. ఎస్.యూనిట్ ప్రత్యేక శిబిరం





**విజయనగరం, (రాజధాని వార్తలు):** స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం కళాశాలకు చెందిన ఎన్. ఎస్. ఎస్. యూనిట్ ప్రత్యేక శిబిరం కొండకరకం గ్రామంలో నాలుగవ రోజు కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత మరియు పరిసరాల పరిశుభ్రతపై సీతం కళాశాలకు చెందిన 60 మంది ఎన్.ఎస్.ఎస్.వాలంటీర్లు అవగాహన కల్పించారు. అలాగే ఎన్.ఎస్.ఎస్.వాలంటీర్లు గ్రామ ప్రజలకు మరియు పాఠశాల విద్యార్థులకు క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవడం, సురక్షితమైన త్రాగునీరు, వ్యర్థాల నిర్వహణ, ఇళ్ళు మరియు పరిసరాల పరిశుభ్రతను కాపాడుకోవడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అదేవిధంగా పరిశుభ్రమైన అలవాట్లను బాగా అర్థం చేసుకోవడానికి మరియు వాటిని అవలంబించడానికి పారిశుధ్య పద్ధతులపై ఆచరణాత్మక ప్రదర్శనలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య తనిఖీ శిబిరంలో జనరల్ సర్జన్ డాక్టర్ నవీన్ గ్రామస్తులకు రక్తపోటు మరియు రక్తంలోచక్కెర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. మరియు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు, నివారణ, ఆరోగ్య సంరక్షణ పద్ధతుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు మరియు క్యాన్సర్ నివారణ, ముందస్తు గుర్తింపుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్.ఎస్.ఎస్ – జేఎన్టీయూ –గురజాడ విజయనగరం నోడల్ ఆఫీసర్ ఎన్. సతీష్ కుమార్, సీతం కళాశాల ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్.వి.ఎస్.రాజు సమన్వయం చేశారు.

# చదువుతో పాటు క్రీడలకు ప్రభుత్వ ప్రాధాన్యం

## - జిల్లా స్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలను ప్రారంభించిన గంటా




**ఆనందపురం, (రాజధాని వార్తలు):** చదువుతో పాటు క్రీడలకు ప్రభుత్వం ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆనందపురం హైస్కూల్ లో అండర్ 17 జిల్లా స్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలను గురువారం ప్రారంభించిన సందర్భంగా మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించించిన క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో వెయిటేజ్ ఇవ్వనున్నట్టు వెల్లడించారు. క్రీడల్లో గెలుపు, ఓటములను పట్టించుకోకూడదని, పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ విజేతలుగానే భావించి క్రీడా స్ఫూర్తి చాటాలని పేర్కొన్నారు. క్రీడల వల్ల జీవితంలో ఎంత పెద్ద సమస్యనైనా తట్టుకునే ధైర్యం అలవడుతుందన్నారు. ఎంతో మంది విద్యార్థులను మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దిన పి.ఈ.టి. ఉమామహేశ్వరరావు సేవలను శ్లాఘించారు. విద్యా వ్యవస్థ బలోపేతం కావాలంటే మౌలిక సౌకర్యాలతో పాటు తగినంత మంది టీచర్లు అవసరమని గుర్తించి సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ద్వారా 17 వేల పోస్టులను భర్తీ చేశారన్నారు. అయిదేళ్ల వైసీపీ హయంలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయకుండా విద్యా వ్యవస్థను అస్తవ్యస్తం చేశారని గంటా విమర్శించారు. వచ్చే ఏడాది జనవరిలో కొత్త డీఎస్సీకి నోటిఫికేషన్ ఇవ్వనున్నామని.. ఇకపై ప్రతి ఏటా కొత్త టీచర్ల రిక్రూట్మెంట్ ఉంటుందన్నారు. విద్యార్థులు భోజనం చేయడానికి స్కూల్లో డైనింగ్ హాల్ లేదని గతంలో హైస్కూల్‌కు వచ్చినప్పుడు చెప్పడంతో స్పందించి డైనింగ్ హాల్ ఏర్పాటు చేయిస్తున్న గంటాకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ కామేశ్వరరావు, ఎమ్మార్వో శ్రీనుబాబు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, తాట్రాజు అప్పారావు, బి.ఆర్.బి. నాయుడు, గాడు వెంకటప్పుడు, గండ్రెడ్డి సోమినాయుడు, పాండ్రంగి అప్పలరాజు, లక్ష్మి, తమ్మిన అప్పలరాజు, బమ్మిడి ఉమాదేవి, రమణ, శివాజీ, కుమార్, ఎర్ర రాజు, కోరాడ వైకుంఠం, బమ్మిడి తారక్ తదితరులు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
# 9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- ., అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ అయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎప్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్కు 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# నలుగురు సైబర్ నేరగాళ్లు అరెస్ట్ - మరొకరి కోసం గాలింపు : జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** డిజిటల్ అరెస్టులు పేరిట ఓ ఉపాధ్యాయుని బెదిరించి, అతని వద్ద నుంచి 22 . 50 లక్షల రూపాయలు కాజేసిన సైబర్ నేరగాళ్లను బొబ్బిలి పోలీసులు అత్యంత చాకచక్యంగా పట్టుకున్నారు. వారి బ్యాంక్ అకౌంట్ లలో ఉన్న ఈ మొత్తాన్ని ఫ్రీజ్ చేశారు. జిల్లా ఎస్పీ ఏ.ఆర్. దామోదర్ గురువారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసుకి సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. బొబ్బిలి పట్టణానికి చెందిన చింత రమణ అనే ఉపాధ్యాయుడుకు సెప్టెంబర్ 15వ తేదీన డిజిటల్ అరెస్టులు పేరిట ఫోన్ కాల్స్ వచ్చాయి. నీ ఆధార్ నెంబర్తో మానవ అక్రమ రవాణా, ఇతర సైబర్ నేరాలకు పాల్పడినట్లు మా దగ్గర ఆధారాలు ఉన్నాయని ,మేము సి.బి.ఐ నుంచి ఫోన్ చేస్తున్నామని, మిమ్మల్ని అరెస్టు చేస్తామని బెదిరించారు. దీంతో ఆందోళనకు గురైన చింత రమణ సైబర్ నేరగాళ్లు చెప్పినట్లు వేర్వేరు బ్యాంక్ ఖాతాల్లో దఫదఫాలుగా 22 లక్షల 50 వేల రూపాయలు వేశాడు. సైబర్ నేరగాళ్ల వేధింపులు తట్టుకోలేక అక్టోబర్ 9వ తేదీన బొబ్బిలి పోలీసులను ఆశ్రయించాడు. జరిగిన సంఘటనను వివరిస్తూ ఫిర్యాదు చేశాడు. దీంతో సర్కిల్ ఇన్స్పెక్టర్ సతీష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సైబర్ నేరగాళ్ల ఎకౌంట్ల ఆధారంగా అత్యంత చాకచక్యంగా చెన్నైలోని పలు ప్రాంతాల్లో సునీల్ సుతార్, సతీష్, రాజేష్ పాల్, మహమ్మద్ ఇర్ఫాన్ లను ఒకేసారి పట్టుకున్నారు. ఈ కేసులో మరొక నిందితుడు వినోద్ చౌదరి పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలిస్తున్నామని తెలిపారు. డిజిటల్ అరెస్టుల పేరిట వస్తున్న ఫోన్ కాల్స్కు ఏ ఒక్కరు భయపడవద్దని, వెంటనే సమీపంలోని పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎస్పీ ఏ.ఆర్. దామోదర్ ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు. ఈ సమావేశంలో బొబ్బిలి డిఎస్పి భవ్య రెడ్డి, సర్కిల్ ఇన్స్పెక్టర్ సతీష్ కుమార్ పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలు :ఎంపీడీవో అర్జున్ రావు




**మక్కువ, (రాజధాని వార్తలు):** మక్కువ మండలంలో గల గిరిజన సంక్షేమ హాస్టల్ నందు వైయస్ వలస గ్రామంలో ఎంపీడీవో అర్జునరావు తనిఖీలు నిర్వహించారు. దీంట్లో భాగంగా పిల్లలు హాజరు పట్టి మరియు స్టాక్ రిజిస్టర్ పరిశీలన చేశారు పిల్లలకు మధ్యాహ్నం భోజనం మెనూ ప్రకారం పెడుతున్నారా లేదా అని ఆరా తీశారు. వైయస్ వలస హాస్టల్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోజనం చేసే ముందు చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని. అలాగే హాస్టల్లో గల టాయిలెట్స్ ను ఎప్పటికప్పుడు నీట్గా క్లీన్ చేస్తూ వినియోగించాలని ఆయన తెలిపారు. అలాగే అనాస భద్ర గ్రామంలో అంగన్వాడి సెంటర్ ను తనిఖీ చేశారు. మెనూ ప్రకారంగా పిల్లలకు వండి పెట్టాలని అలాగే పిల్లలకి ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉన్నట్లయితే వాటిని స్థానిక వైద్యాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. అనంతరం మా ఊరికి మలేరియా అనే కార్యక్రమంలో భాగంగా మురుగు నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. అలాగే కాలువలలో దోమల యొక్క లార్వను పెరగకుండా ఆయిల్ బాల్స్ వేసి వాటిని నిరూపించాలి అని తెలియజేశారు. దోమతెరలు వాడు కోవాలని అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అర్జునరావు తో పాటుగా డి ఎల్ పి ఓ ఎం నాగభూషణరావు మరియు డిప్యూటీ ఎంపీడీవో ఎం సూర్యనారాయణ, వైద్యాధికారులు, స్కూల్ ప్రిన్సిపాల్ మరియు అంగన్వాడి కార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

# అత్యంత వైభవంగా శ్రీలలితా రుద్ర మహా యజ్ఞం..పూర్ణాహుతి
## - పీఠాధిపతులు శ్రీ రాజరాజేశ్వరానంద స్వామి



**సంగం, (రాజధాని వార్తలు):** సంగం తిరుమనకొండపై కొలువై ఉన్న శ్రీ రాజరాజేశ్వరిదేవి సమేత శ్రీకా శివిశ్వేశ్వర స్వామి జ్ఞాన పీఠం నందు లోక కళ్యాణం విశ్వశ్యాంతి ధర్మ సంస్థాపనార్థం సమృద్ధ పాడి పంటలు కొరకు 45 రోజులు శ్రీ లలితా రుద్ర మహాయజ్ఞం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించినట్లు ఆయన తెలిపారు.ఆశ్వీజ పాడ్యమి తేది 22-09-2025 తేది నుండి 05-11-20 25 వరకు ప్రతిరోజు శ్రీలలితా సహస్ర నామము మరియు దశమహాయజ్ఞముల విద్య దేవతతల మూల మంత్రములతో నిర్వహించబడినది పీఠాదిపతులు శ్రీరాజ రాజేశ్వరానంద స్వామి వారి ఆధ్వర్యములో నిర్వహించబడినది. కార్తీక పౌర్ణమి సందర్భంగా మహా పూర్ణాహుతి నిర్వహించబడినది. కాశీ విశ్వేశ్వర స్వామి వారికి రుద్రాభిషేకం అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు.

# జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలు :ఎంపీడీవో అర్జున్ రావు



**మక్కువ, (రాజధాని వార్తలు):** మక్కువ మండలంలో గల గిరిజన సంక్షేమ హాస్టల్ నందు వైయస్ వలస గ్రామంలో ఎంపీడీవో అర్జునరావు తనిఖీలు నిర్వహించారు. దీంట్లో భాగంగా పిల్లలు హాజరు పట్టి మరియు స్టాక్ రిజిస్టర్ పరిశీలన చేశారు పిల్లలకు మధ్యాహ్నం భోజనం మెనూ ప్రకారం పెడుతున్నారా లేదా అని ఆరా తీశారు. వైయస్ వలస హాస్టల్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోజనం చేసే ముందు చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని. అలాగే హాస్టల్లో గల టాయిలెట్స్ను ఎప్పటికప్పుడు నీట్ గా క్లీన్ చేస్తూ వినియోగించాలని ఆయన తెలిపారు. అలాగే అనాస భద్ర గ్రామంలో అంగన్వాడి సెంటర్ ను తనిఖీ చేశారు. మెనూ ప్రకారంగా పిల్లలకు వండి పెట్టాలని అలాగే పిల్లలకి ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉన్నట్లయితే వాటిని స్థానిక వైద్యాధికారుల దృష్టికితీసుకుని వెళ్లి జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. అనంతరం మా ఊరికి మలేరియా అనే కార్యక్రమంలో భాగంగా మురుగు నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. అలాగే కాలువలలో దోమల యొక్క లార్వను పెరగకుండా ఆయిల్ బాల్స్ వేసి వాటిని నిరూపించాలి అని తెలియజేశారు. దోమతెరలు వాడు కోవాలని అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అర్జునరావు తో పాటుగా డి ఎల్ పి ఓ ఎం నాగభూషణరావు మరియుడిప్యూటీ ఎంపీడీవో ఎం సూర్యనారాయణ, వైద్యాధికారులు, స్కూల్ ప్రిన్సిపాల్ మరియు అంగన్వాడి కార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan